జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 247 | హైదరాబాద్, జూన్ 26 శనివారం 2021 | 8 పేజీలు | వెల : 5.00



# రైజింగ్‌లో హైదరాబాద్ రియల్..!

హైదారాబాద్, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి:ఏప్రిల్ జూన్ 2021 మధ్య కాలంలో దేశంలోని ఏడు ప్రధాన సిటీలలో ఇండ్ల అమ్మకాలు అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 93 శాతం పెరిగాయి. కాకపోతే, జనవరి మార్చి క్వార్టర్ తో పోలిస్తే మాత్రం ఈ అమ్మకాలు 58 శాతం పడిపోయాయి. కరోనా సెకండ్ వేవ్ ఎఫెక్ట్ తో తాజా క్వార్టర్లో సేల్స్ తగ్గాయని ప్రోపర్టీ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడించింది. ఢిల్లీ ఎన్ సీఆర్ , ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), చెన్నై, కోల్ కత, బెంగళూరు, హైదరాబాద్ , పుణె సిటీలలో మొత్తం 24,570 హౌసింగ్ యూనిట్లు అమ్ముడయినట్లు తెలిపింది. కిందటేడాది ఏప్రిల్ జూన్ మధ్యలో 12,740 రెసిడెన్షియల్ హౌసింగ్ యూనిట్లు సేలవగా, ఈ ఏడాది మార్చితో ముగిసిన క్వార్టర్లో 58,290 హౌసింగ్ యూనిట్లు అమ్ముడుపోయాయని అనరాక్ ఈ రిపోర్టులో పేర్కొంది. ఈ క్వార్టర్ ఇంకా పూర్తవడానికి వారం రోజులుండగానే అనరాక్ ఈ డేటాను ప్రకటించింది. అయితే, డేటా ముందుగా ఎందుకు రిలీజ్ చేసిందో మాత్రం అనరాక్ వెల్లడించలేదు. సాధారణంగా క్వార్టర్ ముగిశాక ప్రాప్ టైగర్ , నైట్ ఫ్రాంక్ ఇండియా, ప్రాప్ ఈక్విటీ, జేఎల్ ఎల్ ఇండియాలు తమ డేటాను విడుదల చేస్తున్నాయి. ఏడు మేజర్ సిటీలలోనూ రెసిడెన్షియల్ హౌసింగ్ యూనిట్ల అమ్మకాలపై కరోనా సెకండ్ వేవ్ ఎఫెక్ట్ పడిందని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు. అంతకు ముందు క్వార్టర్ తో పోలిస్తే అమ్మకాలు బాగా తగ్గాయని పేర్కొన్నారు. కిందటేడాది ఏప్రిల్ జూన్ మధ్యలో అమ్మకాలతో పోలిస్తే మాత్రం తాజా క్వార్టర్లో సేల్స్ చాలా మెరుగ్గా ఉన్నాయన్నారు. అంతకు ముందు ఏడాది నేషనల్ లాక్ డౌన్ లాగా ఈ ఏడాది లోకల్ లాక్ డౌన్లు ఎక్కువ ప్రభావం చూపించలేదన్నారు. వ్యాక్సినేషన్ ఊపందుకోవడంతో చాలా రాష్ట్రాలలో రెస్ట్రిక్షన్లు తొలగిపోతున్నాయని, దీంతో ఇండ్ల అమ్మకాలు జులై సెప్టెంబర్ క్వార్టర్లో మళ్లీ జోరందుకుంటాయని పురి చెప్పారు. గతంలో ఇళ్లు కొన్నవారు ఇప్పుడు పెద్ద ఇళ్లు కావాలనుకుంటున్నారని, మిలినియల్స్ ఇళ్ల కొనుగోళ్లలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారని పురి వెల్లడించారు. ఏప్రిల్ జూన్ 2021 క్వార్టర్లో

(మిగతా 2లో..)

# పట్టణాల్లోనూ నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు :కేటీఆర్

హైదరాబాద్,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: నగరంలో మరో నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. నాగోల్‌లోని ఫతుల్లాగూడలో భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వెట్ ప్రాసెసింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను నిర్మించారు. రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం చేస్తారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టణాల్లో



కూడా నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్ 18001201159. ఇప్పటికే జీడిమెట్లలో భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను నిర్మించామని గుర్తు చేశారు.

(మిగతా 2లో..)



# కేసీఆర్‌కు ఈటల లేఖ!

కరీంనగర్: సీఎం కేసీఆర్‌కు మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ రాసినట్టుగా చెబుతోన్న లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. "అన్నా క్షమించు" అంటూ కేసీఆర్‌కు ఈటల లేఖ రాసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే మంత్రిగా ఈటల ఉన్నప్పుడు రాసిన లేఖగా పోస్టింగ్ అయింది. కొందరి వల్ల తప్పులు చేశా, మీటింగులు పెట్టా అంటూ లేఖలో పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో తనను వేలు పట్టి నడిపించారని లేఖలో రాశారు.

(మిగతా 2లో..)

# గర్భిణులకు కోవిడ్ టీకా ఇవ్వాల్సిందే: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ టీకాలను గర్భిణులకు ఇవ్వవచ్చు అని కేంద్ర ఆరోగ్యశాఖ తన మార్గదర్శకాల్లో సూచించిందని, ప్రెగ్నెంట్ మహిళల్లో వ్యాక్సినేషన్ ఉపయోగపడుతుందని, వారికి టీకాలు ఇవ్వాల్సిందే అని ఐసీఎంఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ్ తెలిపారు. సార్స్ సీవోవీ2 వేరియంట్లు అయిన ఆల్ఫా, బీటా, గామా, డెల్టాలపై కోవీషీల్డ్, కోవాగ్జిన్ టీకాలు పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 12 దేశాల్లో డెల్టాప్లస్ కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇండియాలో 50 కేసులను గుర్తించినట్లు తెలిపారు. డెల్టా ప్లస్ వైరస్‌ను ఐసోలేట్ చేసి కల్చర్ చేస్తున్నామని, మిగితా వేరియంట్లకు




చేసిన పరీక్షలనే చేస్తున్నామని, ల్యాబ్‌ల్లో వ్యాక్సిన్ సమర్థతను పరీక్షిస్తున్నామని, మరో పది రోజుల్లో ఫలితాలు వస్తాయని బలరామ్ భార్గవ్ తెలిపారు.ప్రస్తుతం ప్రపంచంలో ఒకే ఒక దేశం పిల్లలకు వ్యాక్సిన్ ఇస్తున్నట్లు ఐసీఎంఆర్ చీఫ్ తెలిపారు. అయితే మరి చిన్న పిల్లలకు వ్యాక్సిన్ అవసరమా అన్నది ఇంకా తెలియని ప్రశ్నగానే మిగిలిపోయిందన్నారు. డేటా పూర్తిగా తెలియనంత వరకు.. పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వలేమని బలరామ్ భార్గవ్ వెల్లడించారు. అయినా తాము ఓ చిన్నపాటి స్టడీ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. 2 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లల్లో పరీక్షిస్తున్నట్లు తెలిపారు.

# ఆత్మ కమిటీ రైతు సేవకే పునరంకితం కావాలి:హరీష్ రావు



సిద్దిపేట,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు రైతులకు ఓ వరం. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ రైతుల దశ, దిశ మార్చి కొత్త రూపునిచ్చారు. ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) కమిటీదే. ఆత్మ కమిటీ రైతు సేవకే పునరంకితం కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు కోరారు. సిద్ధిపేట విపంచి ఆడిటోరియంలో శుక్రవారం ఆత్మ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఆత్మ కమిటీ చైర్మన్‌గా లక్కరసు ప్రభాకర్ వర్మ, 24 మంది కమిటీ మెంబర్లు మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. ఆత్మ పథకం రైతులకు అభివృద్ధి, శిక్షణ, నూతన ప్రదర్శన క్షేత్రాలు వంటి కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. సమైక్య రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలు, కరెంట్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి హరీష్ రావు చెప్పారు. రైతులు ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేసేవారని, ఇప్పుడు అలాంటి సమస్యలు లేవన్నారు. ఈ యేడు 60 లక్షల 83 వేల 793 మంది రైతులకు రూ.7300 కోట్లు పెట్టుబడి సాయం కింద బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గతేడాది రాష్ట్రంలో 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా, పంజాబ్ రాష్ట్రంలో 2 కోట్ల 2 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండింది. ధాన్యపు రాశులను దేశానికే తెలంగాణ రాష్ట్రం అందించింది అని స్పష్టం చేశారు.

(మిగతా 2లో..)

## పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com

ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటునారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

ప్రధాన ఆశయాలు

సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) అశయాల పట్ల అవగాహన కల్పించడానికి రండి కదలి రండి.

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్య కులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యాంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.
5. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లీం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ, బుద్ధిస్టులకు సేపరేట్ ఎలక్ట్రోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్క ప్రతిపాదనను అంగీకరించినా... వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించు కునేందుకు రండి.. కదలి రండి...

కమిటీల నిర్మాణం

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.
ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.
అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది

ఆశయాలు
ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

1. చట్టపరమైన రిజర్వేషన్స్ అమలుకు నోడల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయుట.
2. ప్రైవేట్ రంగంలో నడిచే అన్ని సంస్థలలో రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయుట, వాటి వివరాలను సంస్థ నోటీస్ బోర్డులలో పెట్టి సమాచార హక్కు చట్టం (RTI Act) పరిధిలో ఉంచుట.
3. కులనిర్మూలనలో భాగంగా జనాభా గణనలో "సమతా కులం" అనే పేరు మీద ఒక కొత్త కులాన్ని చేర్చి, వారికి ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రాధాన్యతను ఇస్తూ, కులాంతర వివాహం చేసుకున్నవారికి ప్రాణ, ఆస్తి, సామాజిక రక్షణ కల్పించడానికి బాధ్యత వహించడం. కులనిర్మూలన కోసం "సమతా కులమే" ఏకైక కులంగా ఉంచుట.
4. నిరుద్యోగ నిర్మూలన కొరకు 7వ తరగతి నుండి పిజి చేసిన ప్రతి నిరుద్యోగులకు వారికి ఇష్టమైన ఉద్యోగ, వ్యాపార రంగాలలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అవకాశాలను కల్పించుట.
5. అన్ని ప్రభుత్వ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చి, అందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించుట.
6. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటిస్తూ, విపత్కర పరిస్థితుల్లో కౌలు రైతు / రైతుకు నష్టపరిహారం చెల్లించుట.
7. భూమి లేని రైతులందరికి నాలుగు ఎకరాల భూమి ఇచ్చుట
8 భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతిపౌరుడిని భాగస్వామిగా చేస్తూ దేశం వదిలి పారిపోని బహుజనులకు వారి వ్యాపార వ్యవసాయ రంగాలకు గాను రూ. 2,00,000/- (అక్షరాలా రెండు లక్షల రూపాయలను) హామి లేని ఋణాన్ని కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే ఇచ్చి, చెల్లింపులనంతరం రెట్టింపు ఋణాలిచ్చి ప్రోత్సాహించుట.
9. రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి చిరు ఉద్యోగి వరకు అందరూ విధిగా ప్రభుత్వా ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకొనుట.
10. ప్రతి పూరిగుడిసెను విశాలమైన వీదులలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కాగృహాలను నిర్మించుట.
11. అన్ని సమస్యలకు మూలకారణం అయిన "మద్యపానాన్ని" పూర్తిగా నిషేదించుట.
12. మతం మారినా కులం మరాదు కాబట్టి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ఎస్సీలకు వర్తింపచేయుట.
13. కార్మికులకు, కర్షకులకు, వలస కూలీలకు, వ్యవసాయ కూలీలకు, రూ. 50,00,000/- విధిగా జీవిత భీమాను కల్పించుట.
14. కుటీర పరిశ్రమలను పెట్టాలనే ఆసక్తివున్నవారికి మౌళిక వసతులు కల్పించి, వాటిని అద్దెకిచ్చి వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుట.
15. భూమిలేని ముస్లింలకు, కిష్టియన్‌లకు మరియు హిందువులకు ఆయా సంస్థల ఆధీనంలో గల భూములను పంచుట.
16. దేవాదాయ భూములను, భూమిలేని పేద రైతులకు కౌలుకు ఇచ్చుట.
17. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను ఒక ప్రత్యేక సంస్థగా రూపొందించుట.
18. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి నమోదైన ప్రతి ఒక ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రపోర్షనేట్‌గా ప్రభుత్వ అడ్వర్టైజ్‌మెంట్స్‌ను ఇచ్చి ప్రోత్సాహించుట.
19. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ రంగాలలో లంచం ఇచ్చే అవినీతి పరులను పాము కంటే విషపూరితమైన వ్యక్తిగా భావించుట.
20. ఎన్నికల్లో డబ్బులు పంచే వ్యక్తులను, ఆయా కుటుంబాలను ఎన్నికల్లో పోటి చేయకుండా, పోటీకి అనర్హులుగా ప్రకటించుట. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేయుట.

అసక్తి ఉన్నవారు సంప్రదించగలరు

ఆంధ్రప్రదేశ్
డా॥ ప్రత్యూష సుబ్బారావు కన్వీనర్, 9030644440
డా॥ పి. పరమ శివన్, 9440077239
సమ్మి అప్పారావు 9440137451
అమిరిశెట్టి శ్రీధర్ 9491664469
దేవి 9394668555
యం. కమలాకర్ రావు, 9393921011
సాంటి నాగరాజు, 9959488555
కె. హనుమంత్‌రావు ముదిరాజ్ 9392004473
అనుశ్చంద్ర ప్రసాద్ 7989747376

తెలంగాణ
మల్లెల రామనాథం, 9346939481
అరెపల్లి రాజేందర్, 9440918371
డా॥ గుండు కిష్టయ్య ముదిరాజ్, 9948335870
నాగుల శ్రీనివాస్ యాదవ్, 9849170810
లాల్ కృష్ణ ప్రసాద్, 9949479292
రమ్య కురుమ,
ఉప్పు సత్యనారాయణ, 8688300704
డి. గోవర్ధన్, 9963300551

Central Working Committee Members :
జె.బి. రాజు బహుజన IIS-vrs నిశాంత్ బహుజన
డా॥ గూడూరు సీతామహాలక్ష్మీ 8008840506
గుంజి నరసింహా రావు 7995914086
దూలపల్లి వాణి 8019033885
నేషనల్ కన్వీనర్ డా॥ కె. శివభాగ్యారావు బహుజన IRS-vrs
జై భీమ్... జై పూలే... జై భారత్

# తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ ను కలిసిన భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నీలం పద్మ




DISTRICT MAHILA CONGRESS COMMITTEE
YADADRI BHONGIR.
NEELAM PADMA
President
NEELAM PADMA
President

జూన్ 25 హైదరాబాద్ ప్రజాపాలన: యాదాద్రి-భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీసు స్టేషన్ లో జరిగిన మరియమ్మ అనే మహిళా లాకప్ డెత్ జరుగుటకు కారకులైన వారి పై ఎలాంటి చర్య తీసుకొలేదని ఈ సంధర్భంగా ఆవేధన వ్యక్తం చేశారు. భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన జిల్లాలో మహిళా లాకప్ డెత్ విషయమై శుక్రవారం నాడు హైదరాబాద్ లోని రాష్ట్ర మహిళా కమీషన్ ను కలవడం జరిగినది. ఖమ్మం జిల్లా చింతకాని పరిధిలోని కోమట్ల గూడెంకు చెందిన మరియమ్మ అనే మహిళను మహిళా అధికారిణి లేకుండానే విచారణ పేరుతో కొట్టి హింసించడం వలన లాకప్ డెత్ అడ్డగూడురు పోలీసు స్టేషన్ లో జరుగినదని వాపోయారు. ఈ లాకప్ డెత్ కు బాధ్యులైన వారిపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. చనిపోయిన మరియమ్మ కూతురు కుమారున్ని కూడ పోలీసు స్టేషన్ లో విచారణ పేరుతో కొట్టి హింసించారని ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిశ్చ పొందుతున్నారని అన్నారు. కాలయపన చేయడం వల్ల నింధితులు తప్పించుకునే అవకాశం ఉన్నది. తక్షణవే విచారణ జరిపి ఈ సంఘటనకు ఉసిగొల్పిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డిని కార్యాలయంలలో కలిసి వినతి పత్రం అందజేశారు. అడ్డగూడురు పోలీసు స్టేషన్ కస్టడీలో మృతి చెందిన మరియమ్మ ఉదంతంపై పలు మహిళా సంఘాలు, ప్రతి పక్షాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నుండి రోజు రోజుకు పెద్ద ఎత్తున నిరసనలు వెల్లు వెత్తుతున్నాయి. మహిళా లాకప్ డెత్ పై హైకోర్టు కూడా తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. ఈ దుర్ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండ పోయిందన్నారు. ఏరోజు ఏం జరుగుతుందో అని మహిళలు భయ భ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలు,యస్.సిబీ యస్.టి.లపై జరిగే సంఘటనలు పునరావృతం కాకుండ వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కోవిడ్ నిబంధనలను పాటిసాస్తూ ఈ కార్యక్రమంలో దుర్గా రాణి, ధనలక్ష్మీ, మాధవి, ఇందిర, అచ్చాలు మొదలగు మహిళ నాయకురాల్లు పాల్గొన్నారు.

## రైజింగ్‌లో హైదరాబాద్ రియల్..!

(మొదటి పేజీ తరువాయి)

ముంబైలో హౌసింగ్ సేల్స్ ఏకంగా రెండు రెట్లు పెరిగి 7,400 యూనిట్లకు చేరాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో ఈ అమ్మకాలు 3,620 యూనిట్లే. పుణెలో తాజా క్వార్టర్లో అమ్మకాలు 3,790 యూనిట్లు. ఇక ఢిల్లీ ఎన్ సీఆర్ లో సేల్స్ 65 శాతం పెరిగి 3,470 యూనిట్లకు చేరుకున్నాయి. బెంగళూరులో ఇండ్ల అమ్మకాలు 19 శాతం పెరిగి 3,560 యూనిట్లకు చేరినట్లు రిపోర్టు తెలిపింది. మన హైదరాబాద్ లో ఏప్రిల్ జూన్ మధ్య కాలంలో ఇండ్ల అమ్మకాలు ఏకంగా 3,240 యూనిట్లకు పెరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో ఈ సేల్స్ 660 యూనిట్లు మాత్రమే. మార్చి 2021 క్వార్టర్ తో పోలిస్తే మాత్రం ఇండ్ల అమ్మకాలు 26 శాతం తగ్గుతాయని అనరాక్ రిపోర్టు వెల్లడిస్తోంది. మార్చి 2021 క్వార్టర్లో హైదరాబాద్ లో 4,400 ఇండ్లు అమ్ముడుపోయాయి.ఏడు సిటీలలోనూ కలిపి అన్ సోల్డ్ ఇన్వెంటరీ (అమ్ముడుపోని ఇండ్లు) తాజా క్వార్టర్లో 2 శాతం పెరగొచ్చని అనరాక్ అంచనా వేస్తోంది. ఈ క్వార్టర్లో సప్లయ్ పెరగడమే దీనికి కారణమని పేర్కొంది. కరోనా సెకండ్ వేవ్ ఎఫెక్ట్ తో ఈ సిటీలలో రెసిడెన్షియల్ ప్రోపర్టీల రేట్లు మాత్రం నిలకడగానే ఉన్నాయని అనరాక్ రిపోర్టు తెలిపింది. ఏడాది ప్రాతిపదికన చూస్తే ఈ పెరుగుదల బెంగళూరు, ఎన్ సీఆర్ లో 2 % ఉంటే, ఎంఎంఆర్ , పుణె, హైదరాబాద్, చెన్నైలలో ఒక శాతం ఉందని తెలిపింది.

## పట్టణాల్లోనూ నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు :కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జీడిమెట్ల ప్లాంట్‌లో రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం జరుగుతుందన్నారు. ఇవాళ ప్రారంభించిన ఫతుల్లాగూడ ప్లాంట్‌లో కూడా రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో 2 వేల టన్నుల వ్యర్థాల పునర్వినియోగం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కేటీఆర్ చెప్పారు.

## గర్భిణులకు కోవిడ్ టీకా ఇవ్వాల్సిందే: ఐసీఎంఆర్

(మొదటి పేజీ తరువాయి)

వాటి ఫలితాలు సెప్టెంబర్ వరకు వస్తాయన్నారు. కానీ పిల్లల వ్యాక్సినేషన్‌పై అంతర్జాతీయంగా చర్చలు జరుగుతున్నాయని, వారికి వ్యాక్సిన్ ఇవ్వాలా వద్దా అన్న కోణంలో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్‌లో డెల్టా పాజిటివ్ వచ్చిన ఇద్దరు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

### ఆత్మ కమిటీ రైతు సేవకే పునరంకితం కావాలి:హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

నిరంతర విద్యుత్ కోసం రూ. 12 వేల కోట్లు

తెలంగాణలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రతి ఏటా రూ. 12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది రైతుబంధు కోసం రూ. 15 వేల కోట్లు, రైతుభీమా కోసం రూ. 13 వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఏడేండ్లలో తెలంగాణలో ఆశ్చర్యపోయే పని జరిగిందని, ఈ యేడు 90 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసింది అని మంత్రి పేర్కొన్నారు.

పంట మార్పిడి తప్పదు

రైతులను పామాయిల్, సెరికల్చర్ సాగువైపు మళ్లించేలా రైతులను చైతన్య పరచాలని హరీష్ రావు సూచించారు. భవిష్యత్‌లో రైతులకు అధిక ఆదాయాలు ఆర్జించేందుకు పంట మార్పిడి తప్పదన్నారు. వరి వెదసాగు, మల్బరీ సాగు, ఆయిల్ ఫామ్ తోటలు విరివిగా పెంచేలా రైతన్నలకు ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించాల్సిన పెద్ద బాధ్యత ఆత్మ కమిటీ పై ఉన్నది. జిల్లాలో 50 వేల ఎకరాల్లో పామాయిల్, విత్తన సాగు చేసేలా రైతులను ఆత్మ కమిటీ ప్రోత్సహించాలి అని సూచించారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



పరిగి 25 ప్రజా పాలన ప్రతినిధి: వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రం లో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దోమ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం సిత్యా చిన్న కృష్ణ గత 2 సంవత్సరాల నుండి హర్ష మొలల వ్యాధితో బాధపడుతున్నాడు. మహబూబ్ నగర్ లో చికిత్స చేసుకున్న కూడా 3 నెలల నుండి తీవ్ర రక్తస్రావం జరుగుతుంది. ఈ రక్త స్రావం భరించలేక మానసికంగా కుంగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజు తెలిపారు.

## ఏపీ తీరుపై నిప్పులు చెరిగిన మంత్రి నిరంజన్‌రెడ్డి



మహబూబ్‌నగర్ : ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ, కృష్ణానది పరివాహక ప్రాంతంలో అక్రమ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఏపీ తీరును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదికను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రయోజనాల విషయంలో నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ నేతలది సైంధవ పాత్ర అన్నారు. హక్కు లేకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తామంటే పాతరేస్తాం. దాదాగిరీ, గూండాగిరి నడవనివ్వం. ఇప్పుడు మాదొక రాష్ట్రం. మా హక్కులకు విరుద్ధంగా కృష్ణా బేసిన్‌లో దోసెడు నీళ్లను కూడా తీసుకోనివ్వం. కృష్ణా నది నుండి తెలంగాణకు హక్కుగా వచ్చే ప్రతి నీటి చుక్కను వినియోగించుకుంటాం. వెన్నెముకలేని బానిస నేతల మూలంగానే గతంలో తెలంగాణకు అన్యాయం జరిగింది. ఏపీ జలదోపిడీని ఎట్టి పరిస్థితులలో అడ్డుకుని తీరుతాం. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా వెళ్తాం.

**ఏపీకి శాశ్వత నీటి కేటాయింపులు ఎక్కడివి?**

సమైక్యపాలనలో ఆంధ్రా జలదోపిడీకి మద్దతుగా హారతులు పట్టినోళ్లు, దొంగ ప్రాజెక్టులకు సద్దులు మోసిన ఇంటి దొంగలు ఇప్పుడు తెలంగాణకు అన్యాయం జరిగిందని హాహాకారాలు చేస్తున్నరు. తెలంగాణ ఉద్యమమే నదీజలాలు, సాగునీటి హక్కుల కోసం. కృష్ణాజలాలలో తెలంగాణ నీటి వాటా తేల్చకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులుగా మీరున్నారు. పాలితులుగా తెలంగాణ ప్రజలున్నారు. అప్పుడు ఇక్కడి నాయకత్వం మీకు పదవుల కోసం బానిసలుగా మారడంతో అక్రమ ప్రాజెక్టులను కట్టగలిగారు. అసలు ప్రాజెక్టులు కట్టుకునేందుకు ఏపీకి శాశ్వత నీటి కేటాయింపులు ఎక్కడివి ?

**ఆంధ్రా జలదోపిడీని అడ్డుకుంటాం..**

ఇప్పుడు తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రం .. ఆంధ్రా జలదోపిడీని అడ్డుకుంటాం .. ఈ దేశంలో రాజ్యాంగం అమలులో ఉందన్న విషయం ఏపీ ప్రభుత్వం గుర్తించాలి. నీటి కేటాయింపులు జరిగాక, అన్ని రకాల అనుమతులు వచ్చాకనే రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తాం అని ఏపీ ప్రభుత్వం రాతపూర్వకంగా రాసిచ్చారు. ఏపి ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకం, చట్టవ్యతిరేకం, విభజన చట్టంలోని నిబంధనలకు వ్యతిరేకం, సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకం. కేంద్రప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి .. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు నిర్ణీత కాలగడువు విధించి కృష్ణా జలాలలో తెలంగాణ, ఆంధ్రా నీటివాటాలు తేల్చాలి

**స్నేహ హస్తం అందిస్తే.. మిత్ర ద్రోహమే మిగిలింది..**

వృధాగా పోతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుందామని ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు స్నేహ హస్తం అందించారు. కేసీఆర్ దూరదృష్టితో చేసిన సూచనలను వదిలేసి కృష్ణా జలాలను అన్యాయంగా తీసుకుపోతామనడం మిత్ర ద్రోహమే. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి గర్హనీయం. ఆయా రాష్ట్రాల సహజ వనరులు సద్వినియోగం చేసుకునేందుకు కేంద్రం సమస్యలు పరిష్కరించి సహకరించాలి. ఒక ప్రాజెక్టు నిర్మాణంతో వచ్చే ఉత్పత్తి ఎంత? నీటి సంపద ఎంత? మత్స్యసంపద ఎంత? జీవవైవిధ్యం ఎంత? పశుసంపద ఎంత? మొత్తంగా వచ్చే సమాజ సంపద ఎంత? వీటన్నింటిని పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం వ్యవహరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

## కృష్ణా ప్రాజెక్టులపై నిర్లక్ష్యమేనా..?

మహబూబ్ నగర్, జూన్ 25, : పాత ప్రాజెక్టులను పక్కన పడేసిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు కడ్తామని గొప్పలకు పోతోంది. కృష్ణా నదిపై రెండు లిఫ్టులతో పాటు ఒక బ్యారేజీ నిర్మిస్తామని ఇటీవల రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం దక్షిణ తెలంగాణ రైతుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇప్పటికే కృష్ణాపై అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులకు రూ. వెయ్యి కోట్లు ఇవ్వడం లేదు గానీ.. రూ. 20 వేల కోట్లతో కొత్త ప్రాజెక్టులెట్ల కడ్తారంటూ అక్కడి ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కృష్ణా ప్రాజెక్టుల కోసం రూ. 30 వేల కోట్లలోపే ఖర్చు చేశారు. ఇప్పుడు కొత్తగా శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో 3.82 కి.మీ.ల పొడవైన భారీ బ్యారేజీ, సర్జ్‌పూల్, పంపుహౌస్, అక్కడి నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు సుమారు 30 కి.మీ.ల పైపులైన్ వేసేందుకు రూ. 6 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. కల్వకుర్తి రిజర్వాయర్ల?కు 2016లోనే రూ.5 వేల కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చారు. ఇప్పుడు వీటి వ్యయం రూ.6 వేల కోట్లకుపైగా పెరుగనుంది. మిగతా ప్రాజెక్టులు, కాల్వలు, ఇతర పనులు, భూసేకరణకు ఇంకో రూ. 8 వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తం కలిపి రూ. 20 వేల కోట్లు కొత్త ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకే నిధులివ్వని ప్రభుత్వం, ఈ ప్రాజెక్టుల కోసం అంత భారీ మొత్తం ఎక్కడి నుంచి తీసుకువస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయిభీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్? ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణకు రూ. వెయ్యి కోట్లు విడుదల చేస్తే దాదాపు లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టుకు నీరందుతుంది. ఈ అంశంపై అక్కడి రైతులు పదేపదే విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. కనీసం పెండింగ్? బిల్లులను కూడా రిలీజ్? చేయడం లేదు. మరోవైపు రాష్ట్ర ఖజానాలో ఉన్న నిధులన్నీ కాళేశ్వరం ప్రాజెక్టుకే మళ్లించింది. ఇప్పుడు ఉన్నఫళంగా కృష్ణా నీళ్లు గుర్తుకు వచ్చినట్లు.. కొత్త ప్రాజెక్టులు కడ్తామని చెప్పడం సందేహాలకు తెరలేపింది. పాత ప్రాజెక్టుల పనులకు రూ. వెయ్యి కోట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులెలా కడుతుంది..? ఎక్కడి నుంచి నిధులను మళ్లిస్తుంది..? పాత ప్రాజెక్టుల్లో మిగిలిన పనులు పూర్తి చేయకుండా ఎందుకు వదిలేసినట్లు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కృష్ణా ప్రాజెక్టులపై ప్రభుత్వం మొదటి నుంచీ నిర్లక్ష్యం చూపుతోంది. పాలమూరు ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో జూరాల నుంచి శ్రీశైలానికి మార్చింది. ప్రాజెక్టులోనూ మార్పులు చేసింది. 2018లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉన్నా, నిధులు ఇవ్వకపోవడంతో నిర్మాణ వ్యయం రూ. 35 వేల కోట్ల నుంచి 55 వేల కోట్లకు పెరిగింది. రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోయాల్సిన ఈ ప్రాజెక్టును తర్వాత ఒక టీఎంసీకే పరిమితం చేసింది. ప్రాజెక్టు ఫస్ట్? పంపుహౌస్ (ఎల్లూరు)ను మొదట ఓపెన్ కట్‌గా ప్రతిపాదించి తర్వాత అండర్ గ్రౌండ్‌కు మార్చారు. అండర్ గ్రౌండ్ పంపుహౌస్ కోసం చేసిన బ్లాస్టింగ్స్‌తో కల్వకుర్తి పంపుహౌస్ మునిగిపోయింది. నార్లాపూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 8 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు తగ్గించినా నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచేశారు. డిండి ప్రాజెక్టుకు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకోవాలనే దానిపై సర్వేల పేరుతోనే కోట్లు వృథా చేశారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ. 1.17 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఇందులో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల ఖర్చు రూ. 30 వేల కోట్లలోపే ఉంది.



## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి బిఎస్పి పార్టీ

భద్రాద్రి కొత్తగూడెం,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: పెరిగిన పెట్రోల్ .డీజిల్. గ్యాస్ ధరలు తగ్గించాలని ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేసిన బీఎస్పీ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తం బర్ల నరసింహారావు ఉపాధ్యక్షు లు కాకా టి సందీప్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు దేవరకొండ నిర్మల గారు మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ రేట్లు అధికంగా పెరగటం వలన సామాన్యులపై అధిక భారం పడుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా అధిక ధరలను తగ్గించి సామాన్యులపై పడుతున్న భారాన్ని తగ్గించాలని వారు కోరారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో సాయిరాం తండా బి ఎస్ పి పార్టీ పంచాయతీ అధ్యక్షుడు జాటోత్ విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్ పెట్రోల్ రేట్లు పెంచడం వలన ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ పై అధిక భారం పడుతుందని వారు తెలియజేశారు ఎక్కువ చదువులు చదువుకొని గవర్నమెంట్ ఉద్యోగాలు రాక ఉపాధి కోసం ఆటోలు కొనుక్కొని డ్రైవింగ్ చేసుకుంటూ బ్రతికే వారు ఎందరో ఉన్నారని ఆయన అన్నారు వారు అటు ఫ్యామిలీని పోషించుకుంటూ ఇటు ఫైనాన్స్ కట్టుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటారని తెలిపారు అందువలన ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి బాధలు గమనించి పెరిగిన టువంటి డీజిల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన కోరారు.

### మరియమ్మ మృతికి కారణమైన ఎస్. ఐ., నలుగురు కానిస్టేబుల్ లను విధుల నుండి తొలగించాలి

హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ) :యాదాద్రి జిల్లాలోని అడ్డగూడూర్ లోని గోవిందాపూరం గ్రామానికి చెందిన దళిత మహిళ మరియమ్మ మృతికి కారణమైనఎస్.ఐ. తో పాటు నలుగురు కానిస్టేబుల్ లను శ్వాతంగా విధులనుండి తొలగించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (RPI)రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం రోజున పార్టీ రాష్ట్ర కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డగూడూర్ మండలం గోవిందపూరం గ్రామనికి మరియమ్మ మృతికి మరియు ఆమె కొడుకును చిత్రహింసలకు గురిచేసి విపరీతంగా కొట్టిన ఎస్.ఐ,నలుగురు కానిస్టేబుల్ లపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారిని పోలీసులు డిపార్ట్మెంట్ నుండి పూర్తిగా తొలగించాలన్నారు. మరియమ్మ మృతిపై ప్రజల్లో చాలా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అందుకే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిట్టింగ్ జడ్జ్ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా మరియమ్మ కుటుంబంలోఒకరికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం తో పాటు 50 లక్షలరూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు.

### తూము చౌదరిని పరామర్శించిన భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం నాయకులు




కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: తూము చౌదరి మంచితనం మానవత్వం కలబోసిన స్నేహశీలి అని అందరితో కలిసి పోయి ఆపదలో ఉన్నవారిని ఆదుకునే సేవా దృక్పథం కలవాడని ఎంతోమంది అభాగ్యులను ఆదుకున్నాడు అని ఆ అభిమానం ఆశీర్వాదాలే కరోనా మహమ్మారి నుండి కాపాడి స్వస్థ పరిఛాయని భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు.25 06 2021 నాడు లక్ష్మీదేవి పల్లి మండలంలోని ప్రశాంతి నగర్ లో గల తూము చౌదరి స్వగృహానికి భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివ కుమార్ గౌరవాధ్యక్షులు కూసపాటి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందా హనుమంతు జిల్లా ఉపాధ్యక్షులు అంతోటి పాల్ మరియు భాను తదితరులు పరామర్శించి శుభాకాంక్షలు తెలియజేసి ధైర్యం చెప్పినారు.మంచి వాళ్ళని ఎల్లప్పుడూ ఆ దైవం కాపాడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.సకాలంలో టాబ్లెట్లను వాడుతూ ఆహార నియమావళిని పాటించాలని ఇంకా కొన్ని రోజులు విశ్రాంతి అవసరమని హితవు చెప్పారు.ప్రత్యేకంగా వచ్చి తనను పరామర్శించి ధైర్యం చెప్పినందుకు ఈ సందర్భంగా తూము చౌదరి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కేసీఆర్‌కు ఈటల లేఖ!

(మొదటి పేజీ తరువాయి)

అందరినీ కాదని తనకు ప్రాధాన్యత ఇచ్చారంటూ లేఖ రాశారు. కానీ కొందరి తప్పుడు మాటల వల్ల తప్పుదారి పట్టానని ఆ లేఖలో పేర్కొన్నారు. బెంగుళూరు, పూణే ల్లో సమావేశాలు నిర్వహించానని ఆయన తెలిపారు. ఇక మీదట తప్పుడు పనులు చేయనని, తమ్ముడిలా భావించి పెద్ద మనసుతో క్షమించండి అంటూ ఈటల రాసినట్టుగా చెబుతున్న లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ లేఖ నకిలీదంటూ ఈటల సిబ్బంది పేర్కొంటున్నారు. దీనిపై డీఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్న ఈటల పీఏలు తెలిపారు.

# కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: గ్రామానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ దానని భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు కాలికి తీవ్ర గాయం కావడంతో హాస్పిటల్ లో చేర్చిన అనంతరం ఆపరేషన్ తప్పనిసరి కావడంతో టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశం గౌడ్,సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రివర్యులు కేటీఆర్,ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి సమాచారం అందజేశారు. వారు వెంటనే స్పందించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు, కాలికి ఆపరేషన్ అయ్యాక ఇటీవల బాధితుడు భాస్కర్ ఇంటికి చేరుకున్నారు ఈ విషయం తెలుసుకొని స్వయంగా బాధితుడు భాస్కర్ ఇంటికి వచ్చి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటాం అని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యంగా ఉండాలని వారి కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు బాధితుడు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వారితో పాటు జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్,టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశం గౌడ్ ఉన్నారు.



ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ,సర్పంచుల ఫొరం మండల అధ్యక్షుడు శివరాజ్,నల్తూరు సర్పంచ్ జనార్ధన్,టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్,ప్రభాకర్ రెడ్డి,స్థానిక వార్డు సభ్యులు శ్రీధర్ గౌడ్,కొరబోయిన మంజుల యాదయ్య,శ్రీనివాస్ యాదవ్,కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి నాయకులు బ్రహ్మేందర్ గౌడ్,నర్సింహ రెడ్డి, మోహన్,గోపి గౌడ్,చిటుకల వెంకటేష్,కృష్ణ గౌడ్, రాజశేఖర్ రెడ్డి,మున్నీ నర్సింగ్ రావు,జిన్నారం రాము, చిన్న శ్రీనివాస్ యాదవ్,వ ల్లేష్,యాదగిరి,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సమావేశంకు రాని అధికారుల పై ఫిర్యాదు చేస్తా:ఎంపీడీవో..

పాలేరు జూన్ 27 (ప్రజాపాలన ప్రతినిధి) : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించటం జరిగినది సమావేశమునకు హాజరు కానీ వివిధ శాఖల అధికారుల పై అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో యం,చంద్రశేఖర్, తెలిపారు. స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం వైస్ ఎంపీపీ పతానపు నాగయ్య, అధ్యక్షత న జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల ప్రగతి సమీక్షలను చదివి వినిపించారు. తొలుత సమావేశం కు చాలా శాఖల అధికారులు రాకపోవటంతో ఎంపీడీఓ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి సమావేశం కు శాఖల నివేదికలతో తప్పకుండా అందరూ హాజరు కావాలని అలా కాని వారి పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కు చర్యల కోసం ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం ఐకేపీ ఏపీఎం ఆశోక రాణి కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, యం.పీ.వో. నెల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర్, రాజేష్, ఏపీవో సునీత, ఏఈ లు ఓంప్రకాష్, బాలాజీ, సర్పంచ్ లు రాయపూడి నవీన్, గండు సతీష్, పెంట మల్ల పుల్లమ్మ, వల్లాల రాధాకృష్ణ, రేగురి శ్రావణ్ కుమార్, . సుజాత, ఎంపీటీసీ లు వెంకటలక్ష్మి, కల్పన, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం



బెల్లంపల్లి జూన్ 25 ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7 మండలాల మండల అభివృద్ధి అధికారులతో శుక్రవారం నాడు క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే శ్రీ దుర్గం చిన్నయ్య ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాల వారీగా హరితహారం కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని, అలాగే ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పూర్తి పారదర్శకంగా అర్హులకే అందచేయాలని అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవో లతోపాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రపంచ అవయవ దాన మార్పిడి దినోత్సవం రోజున దివ్యాంగురాలు ఉదారం



మేడిపల్లి, జూన్25 (ప్రజాపాలన ప్రతినిధి) చిన్నప్పుడే పోలియోతో రెండు కాళ్లను పోగొట్టుకొని సమాజానికి తన వంతు సేవ చేస్తున్న దివ్యాంగురాలు వేముల బాలమని ప్రపంచ అవయవ దాన మార్పిడి దినోత్సవం రోజు తన మరణానంతరం తన పార్థివదేహాన్ని మరియు నేత్రాలను తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతలు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ కు అంగీకార పత్రాన్ని అందజేసి తన సేవా నిరతిని చాటుకుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతానికి చెందిన వేముల బాలమని సామాజిక సేవలో తనకంటూ ప్రత్యేక శైలితో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న తరుణంలో అవయవ దానం గురించి తెలుసుకొని ప్రపంచ అవయవదాన, మార్పిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబంధిత సంఘం రాష్ట్ర బాధ్యులను సంప్రదించి చక్కటి నిర్ణయాన్ని తీసుకోవడం అభినందనీయమని డాక్టర్ అశోక్ కొనియాడారు. ఈ సందర్భంగా బాలమనినీ పలువురు అభినందించి ,ఆదర్శంగా తీసుకోవాలని ప్రత్యేక అభినందన సత్కారం చేశారు . ఈ కార్యక్రమంలో సంస్కరణ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు వాణి, అవయవ దాతలు సంఘం రాష్ట్ర బాధ్యులు పేర్ల పురుషోత్తం, దుర్గేశ్వర, సాయి కుమార్, డాక్టర్ శివుడు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అశోక్ పరికిపండ్ల ఫోన్ నెంబర్ 9989310141,9390111929.

## నకిలీ ప్రతి విత్తనాల వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు



బెల్లంపల్లి జూన్ 25 ప్రజా పాలన ప్రతినిధిమంచిర్యాల జిల్లా తాండూర్ సర్కిల్ పరిధిలోని వ రా దా ర ం, నెన్నెల, భీమిని, పోలీస్ స్టేషన్ల పరిధిలో రాష్ట్రంలోకి అనుమతి లేని నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా సరఫరా చేస్తూ అమాయక రైతులకు విక్రయిస్తూ మోసలు చేస్తున్న పలువురు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తాండూరు సర్కిల్ స్పెక్టర్ బాబురావు తెలిపారు. శుక్రవారం నాడు ఆయన పత్రికలవారితో మాట్లాడుతూ గత కొంత కాలంగా మంచిర్యాల జిల్లాలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకోనీ నకిలీ ప్రతి విత్తనాలను విక్రయిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వీరిపై నిఘా వేసి హుజూరాబాద్ మండలం కందుల గ్రామానికి చెందిన పెద్ద మల్ల రాజును మరియు భీమిని మండలం పెద్ద పేట గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ల పై మూడు కేసులు నమోదు చేసి కమిషనర్ ఆదేశానుసారం పి.డి యాక్ట్ నమోదు చేసి ఉత్తర్వులను అందించి చెర్లపల్లి కేంద్ర కారాగారం తరలించినట్లు ఆయన తెలిపారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు,పీడీ యాక్ట్ అమలుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ రహేమాన్ , తాండూర్ సీఐ బాబు రావు , ఎస్ఐ మానస, కొమురయ్యలను సీపీ అభినందించారనీ ఆయన తెలిపారు.

## గోవేన గ్రామ సమస్యలు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతి**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 25, ప్రజా పాలన :జిల్లాలోని గోవేన గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, శుక్రవారం ఆ గ్రామస్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యల పరిష్కారం కొరకు జిల్లా కలెక్టర్ తో సమావేశం లో విన్నవించారు. గోవేన గ్రామపంచాయతీ పరిధిలో 5 గ్రామాలు ఉన్నాయని, వీటికి సిసి రోడ్లు నిర్మించాలని, బలన్ పూర్ నుండి గోవేన వరకు, గోవేన నుండి రఘు పూర్ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలకు లింక్ రోడ్లు నిర్మించాలని, కొలాం గుడా, నాయకపుడా, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, డిఆర్, డి పో, ఏర్పాటు, పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, గోండ్ గూడలో పాఠశాల భవనం, గోవేనా లో గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని, పంచాయతీ పరిధి లోని గ్రామాలకు భగీరథ పథకం వర్తింపజేసి నీరు సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి, కార్యదర్శి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



బెల్లంపల్లి జూన్ 25 ప్రజా పాలన ప్రతినిధి:మంచిర్యాల జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాలను బెల్లంపల్లి లోనే ఏర్పాటు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బెల్లంపల్లి బజార్ ఏరియాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఏర్పాటుకు బెల్లంపల్లి అనువైన ప్రాంతమని ఆసిఫాబాద్ మంచిర్యాల రెండు జిల్లాల ప్రజలకు మధ్యలో బెల్లంపల్లి ఉంటుందని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందన్నారు. గతంలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి హోదాలో బెల్లంపల్లి ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చిన విధంగా బెల్లంపల్లిలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు సింగరేణి క్వార్టర్స్, కార్యాలయాలు,200 పడకల సామర్థ్యం గల సింగరేణి ఏరియా ఆసుపత్రి అందుబాటులో ఉందని, 40 శాతం నిర్మాణ పనులు పూర్తయిన పాత కెమికల్ భవనము అందుబాటులో ఉందని ఈ విద్యాసంవత్సరం మెడికల్ కళాశాల ప్రారంభించడానికి అనుకూలంగా బెల్లంపల్లి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి బెల్లంపల్లిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బడికల శ్రావణ్, చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,అల్లి సాగర్,నాయిని మురళిశ్రావణ్, ఆదర్స్ వర్ధన్ రాజు, బచ్చలి ప్రవీణ్, సోదై వినేష్,సంకీర్తన్, ఏముర్ల ప్రదీప్,మద్దెల శ్రీనివాస్, శివ,రాకేష్ పవన్, భాస్కర్ గౌడ్, జుబైద్, తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ చోరీ చేసి బోరు పూడ్చిన వారిపై చర్య తీసుకోవాలి



నెల్లికుదురు జూన్ 25 (ప్రజా పాలన)నెల్లికుదురు రెవెన్యూ శివారు కాచికల్ గ్రామంలోని తమ వ్యవసాయ భూమిలోనీ బోరు బావి కి చెందిన విద్యుత్ మోటార్ స్టార్టర్,మోటార్, ఫ్యూజ్ సెట్ లను అపహరించి బోరు బావి ని పూడ్చి వేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మండలంలోని కాచికల్ గ్రామానికి చెందిన ఘనపురం అనిల్ కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఇక్కడ మాట్లాడుతూ..సర్వే నంబర్ 146/ఇ ,146/ఎఫ్ లోని నా సొంత పట్టా భూమిబోరు బావి నీరు సాగు కోసం అంతర్గత పైపులైన్ నిర్మాణ పనులనుగతకొన్ని రోజుల క్రితంచేస్తుండగాతమపై గాండ్ల వెంకన్న, గాండ్ల రాజు, మాదాసి వీరయ్య, ఆకుల ప్రశాంత్, లు కర్రలు మారణాయుధాలతో వచ్చి దుర్భాషలాడుతూకులం పేరుతో తిడుతూ దౌర్జన్యం గా అడ్డుకున్నారన్నారు. దీంతో నా పట్టా భూమి లో వ్యవసాయ సాగు కోసం చేసే పనులకు నా భూ హక్కులకు ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తులే నా బోరు బావి పూడ్చి మోటారు స్టార్టర్ ,ఫ్యూజులు చోరీ చేసినట్లు అనుమానంగా ఉందనిస్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. దోషులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఆయకట్టు మరమ్మతులు తక్షణమే చేయాలి

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: ఎర్రబెల్లి గూడెం, గుర్తు రు మధ్యలో ఆకేరు వాగు కు గల ఆయకట్టు శిథిలావస్థకు రావడంతో కట్ట కూలి పోవడం జరుగుతుంది, 1885 లో నిర్మించిన ఈ కట్ట మరమ్మత్తుల కోసం అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం ,ఈ కట్ట ఎర్రబెల్లి గూడెం నెల్లికుదురు కు ఏడు కిలోమీటర్ల వరకు పెద్దకాలువ ఉండడంతో వెయ్యి ఎకరాలు సాగుకు నోచుకుంటున్నాయి, పురాతన కట్టడాలను కోల్పోవద్దని నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పుడైనా పట్టించుకోని మరమ్మతులు చేస్తారని కోరుతున్నారు. గ్రామస్తులంతా వర్షాకాలం వస్తే బొగత జలపాతం మాదిరిగా ఉండేవని పిల్లలను తీసుకు వచ్చి అందమైన ప్రదేశాన్ని చూపించే వాళ్ళమని తల్లిదండ్రులు అంటున్నారు. ఈ ఆయకట్టును పర్యాటక స్థలంగా చేయాలని పురాతన కట్టడాలను పుస్తకాల్లో చూస్తున్నాము ఆయకట్టు పురాతనం ఇదే కాబట్టి దీన్ని కాపాడుకోవాలని జలపాతం చుట్టు గ్రామాల అందరూ ప్రజలు సంతోషంగా ఆనందంగా పిల్లలను తీసుకుని వచ్చే వారని దీని మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు వంగాల ఈశ్వర్. కడియం ప్రవీణ్ పలికారు








ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 26, జూన్ 2021

# మునివాకిటే మహమ్మారి, మేల్కోండి!

అలలు అలలుగా కొవిడ్ మహమ్మారి విజృంభిస్తోంది. ఇటీవల రెండు అలలు మనపై విరుచుకుపడ్డాయి. మొదటి అల 2020 మార్చి నుంచి నవంబర్ దాకా ఎంతో మందిని మృత్యుప్రాంగణంలోకి తీసుకువెళ్ళింది. 2021 మార్చి తొలినాళ్ళలో ప్రారంభమైన రెండో అల అసలు బతుకునే మృత్యు సీమగా మార్చి వేసింది. ఇప్పుడు కొవిడ్ కేసులు తగ్గు ముఖం పట్టినప్పటికీ ఈ రెండో హంతక అల ఇంకా చురుగ్గానే ఉంది. కొవిడ్ రెండుదఫాల విజృంభణ మధ్య తేడా ఏమిటి? రెండో విజృంభణతో పోలిస్తే మొదటి విజృంభణ మెల్లగా మరణమృదంగం మోగించింది. రెండో విజృంభణ స్వల్పకాలంలోనే పతాకస్థాయికి చేరింది. తొలిదశలో కంటే మలిదశలో మహమ్మారి సంక్రమణలు 82 శాతం పెరిగాయని కొవిడ్ డేటా విశదం చేసింది. కొవిడ్ మరణాలు మలిదశలో 30 శాతం అధికంగా సంభవించాయి. మొత్తం మీద 'కేస్ ఫెటాలిటీ రేట్' (దీనినే కేస్‌ఫెటాలిటీ రేషియో అని కూడా అంటారు.) 1.43 శాతం నుంచి 1 శాతానికి తగ్గిపోయింది. నిర్దిష్టకాలంలో ఒక అంటువ్యాధి మూలంగా చనిపోయినవారి సంఖ్య అదేకాలంలో ఆ వ్యాధి బారిన పడ్డ వారి మొత్తం సంఖ్య మధ్య ఉన్న నిష్పత్తినే సాంక్రమికరోగ విజ్ఞానంలో కేస్ ఫెటాలిటీ రేట్‌గా పరిగణిస్తారు. ఒక అంటువ్యాధి లేదా మహమ్మారి తీవ్రతను ఈ రేట్ తెలియజేస్తుంది. తొలి విజృంభణలో కంటే రెండో విజృంభణలో కొవిడ్ సోకినవారి సంఖ్య భారీగా పెరిగిపోయింది. దురదృష్టమేమిటంటే తొలిదశలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు రెండో దశలో కంటే చాలా తక్కువగా జరిగాయి. కొవిడ్ విజృంభణ మూడోదశకు ఇప్పుడు మనం సంసిద్ధమవ్వాలి. కొవిడ్ సంక్రమణల హొరు నిలిపివేసే అంశాలు విషమ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడాన్ని అలవరచడం, బాధ్యతాయుత ప్రవర్తనలు, వ్యాక్సినేషన్ (టీకాకరణ) మాత్రమే. వ్యాధి పీడితులను ఏకాంత నిర్బంధ వాసంలో ఉంచడం, కాంట్రాక్ట్ ట్రేసింగ్ మొదలైనవి కొవిడ్ సంక్రమణలను గణనీయంగా తగ్గించాయని రుజువయింది. ఈ చికిత్సా పద్ధతులకు తోడు తరచు చేతులు శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, భౌతికదూరాన్ని పాటించడం మొదలైన ఆరోగ్యకర ప్రవర్తనలతో వ్యాధి బారినపడే ప్రమాదాన్ని దాదాపుగా నివారించుకోవచ్చు. చాలామంది 'సామాజిక లేదా ప్రవర్తనాత్మక వ్యాక్సిన్'గా భావిస్తున్న ఈ చర్యలు తదుపరి, భావి కొవిడ్ అలల నియంత్రణకు ప్రధానాధారంగా కొనసాగుతాయి. 2021 జూన్ నాటికి దేశ జనాభాలో యాభైశాతం మందికి పైగా కొవిడ్ వ్యాధి సంక్రమించినట్టు దేశవ్యాప్తంగా సకలప్రాంతాలకు సంబంధించిన డేటా వెల్లడించింది. అత్యధికులలో వ్యాధి లక్షణాలు స్వల్పస్థాయిలోనూ లేదా గుర్తుపట్టలేని రీతిలో మాత్రమే ఉన్నాయి. ఇలా కొవిడ్ సోకినవారికి 3 నుంచి 6 నెలల పాటు ఆ మహమ్మారి మళ్లీ సోకకుండా రక్షణ లభిస్తుందనిబీ పరిమిత స్థాయి నుంచి తీవ్రస్థాయిలో కొవిడ్ సోకిన వారికి పునః సంక్రమణ నుంచి 6 నుంచి 9 నెలల పాటు రక్షణ లభిస్తుందని వివిధ దేశాలలో జరిగిన అధ్యయనాలు నిర్ధారించాయి. కట్టుదిట్టమైన నివారణ చర్యలు చేపట్టని పక్షంలో ప్రతి నాలుగు నుంచి ఆరు మాసాలకు కొవిడ్ మహమ్మారి మళ్ళీ మళ్ళీ విజృంభించే అవకాశాలు మెండుగా ఉన్నాయనేది స్పష్టం. భారీస్థాయిలో కొవిడ్ సంక్రమణల ఆకస్మిక పెరుగుదల నియంత్రించేందుకు కచ్చితంగా దోహదం చేసే మరో చర్య వ్యాక్సినేషన్. ఈ జూన్ తొలినాళ్ళ వరకు, 18 సంవత్సరాలకు మించిన వయస్సు ఉన్న వారిలో కేవలం 18 శాతం మందికి మాత్రమే ఒక డోసు టీకా వేశారు. రెండు డోసులు వేయించుకున్న వారు కేవలం 4.6 శాతం మంది మాత్రమే. కొవిడ్ సంక్రమణలను పూర్తిగా అదుపు చేయాలంటే దేశజనాభాలో 70 శాతం మందికి టీకా ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి నెలా ఒక కోటి 43లక్షల డోసుల టీకాలు వేసినప్పుడు మాత్రమే ఈ లక్ష్యం నెరవేరుతుంది. దేశంలో టీకా ఉత్పాదక సామర్థ్యం ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే ఆ లక్ష్యం సగం మాత్రమే నెరవేరగలదు. కనుక 18 సంవత్సరాలకు మించిన వయస్సులో ఉన్న భారతీయులందరికీ టీకా వేసేందుకు మనం చాలా చాలా దూరం పయనించవలసి ఉంది. అమెరికా, బ్రిటన్‌లలో ఇప్పటికే 50శాతం మంది వయోజనులు రెండు డోసులు వేయించుకోగా, 85 శాతం మందికి పైగా కనీసం ఒక డోస్ వేయించుకున్నారు. ఈ టీకాకరణ వల్ల ఆ రెండు దేశాలలోనూ కొవిడ్ సంక్రమణలు గణనీయంగా తగ్గిపోయాయి. కొవిడ్ మహమ్మారి ఆకస్మిక విజృంభణలకు సంసిద్ధం కావడానికి, సంభవించే అపాయాన్ని కచ్చితంగా అంచనా వేయడంతో పాటు ఆ హాని తీవ్రతను తగ్గించడం కూడా చాలా ముఖ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నొక్కి చెప్పింది.. దేశ ప్రజలను కొవిడ్ మహమ్మారి నుంచి సంపూర్ణంగా రక్షించేందుకు 2021 నుంచి మనం అత్యంత అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం మనం శీఘ్రగతిన ఎవిడెన్స్ బేస్డ్ ట్రీట్‌మెంట్ గైడ్‌లైన్స్ (వీటినే క్లినికల్ ప్రాక్టీస్ గైడ్‌లైన్స్ అని కూడా అంటారు.) ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించేలా చూడాలి. కొత్త ఔషధాలు, వ్యాక్సిన్ల అభివృద్ధికి వీలుగా పరిశోధనలను ప్రోత్సహించాలి. ఇతర దేశాలలో ప్రజలు అనుసరించిన ఆరోగ్యకరమైన ప్రవర్తనా పద్ధతులు వ్యాధి నియంత్రణకు ఎలా తోడ్పడిందీ ప్రజలకు విపులంగా వివరించాలి. సరైన ప్రవర్తనారీతులను పాటిస్తున్న ప్రజలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. గ్రామీణప్రాంతాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు విరివిగా నిర్వహించాలి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి ఉన్నతస్థాయి ఆసుపత్రుల వరకు ఆరోగ్యభద్రతా సిబ్బందికి మహమ్మారిని ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను సమకూర్చాలి. ఆక్సిజన్ సిలిండర్లు మొదలైన సహాయక ఆరోగ్యభద్రతా సదుపాయాలను సమృద్ధంగా అభివృద్ధి పరచాలి. ఇవి జరిగినప్పుడు మాత్రమే కొవిడ్ ప్రమాదాన్ని మనం పటిష్ఠంగా ఎదుర్కోగలుగుతాము. కొవిడ్ తీవ్రతను, మరణాలను నిరోధించడం మన ప్రాథమిక లక్ష్యం. ఇందుకు మన సంజీవనీ మంత్రం%--%ట్రైనింగ్, టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్, ట్రస్ట్, ట్రాన్సపరెన్సీ. రాబోయే 4 నుంచి 6 నెలల వరకు మతపరమైన వేడుకలు, రాజకీయ కార్యక్రమాలు, సామాజిక సమావేశాలు, వాణిజ్య కార్యకలాపాల ప్రదేశాలలో ప్రజలు పెద్దఎత్తున గుమిగూడడాన్ని నిషేధించి తీరాలి. కొవిడ్ మూడో అలను నిరోధించడంలో పౌర సమాజం కీలకపాత్ర నిర్వహించాల్సి ఉంది. మహమ్మారిని ఎదుర్కోవడంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాంటాక్ట్ ట్రేసింగ్, టీకా వేయించుకోవడంపై అనేక మందిలో ఉన్న సంకోచాలను తొలగించడం, టీకా వేయించుకోవాల్సిన పౌరుల జాబితాలను రూపొందించడం మొదలైన బాధ్యతల నిర్వహణలో పౌరసమాజం భాగస్వామి కావాలి. ఈ మహమ్మారిని సంపూర్ణంగా నిర్మూలించడంలో ప్రభుత్వం మాత్రమే విజయం సాధించలేదు. విధానాల నిర్ణయంలోనూ, వాటిని అమలుపరచడంలోనూ పౌరసమాజం పాలుపంచుకోవాలి. కొవిడ్%--%మానవాళి ఎదుర్కొంటున్న మొదటి మహమ్మారి కాదని, ఎదుర్కోబోయే చివరి మహమ్మారి అంతకన్నా కాబోదని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ వాఖ్యానించడం గమనార్హం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని కొవిడ్ ముప్పుకు మనం సమర్థంగా, ప్రభావశీలంగా ప్రతిస్పందించాలి. ఇందుకు ప్రజారోగ్య సిబ్బందిని సమగ్రంగా సంసిద్ధపరచడం చాలా ముఖ్యం. మహమ్మారిని నిర్మూలించేందుకు అవసరమైన సకల నైపుణ్యాలను వారికి సమకూర్చేందుకు ప్రభుత్వం భారీ మదుపులు చేసి తీరాలి.

## కరోనా కష్టాలు అప్పులతో తీరేనా?

కరోనా మహమ్మారితో దాపురించిన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు భారీ మొత్తాల్లో రుణాలు తీసుకునే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోంది. అప్పుల రూపేణా పొందిన ధనాన్ని రెండు భిన్నరీతుల్లో ఉపయోగించుకోవచ్చు. ఆ డబ్బును ఉత్పాదక కార్యకలాపాల్లో మదుపు చేయడం ఒక పద్ధతి. ఆ మదుపు నుంచి లభించే అదనపు ఆదాయంతో వడ్డీ, అసలు మొత్తాన్ని రుణగ్రహీత చెల్లించగలుగుతాడు. పారిశ్రామికవేత్త బ్యాంకుల నుంచి రుణం తీసుకుని ఒక ఫ్యాక్టరీని నెలకొల్పడం లాంటిదే ఇది కూడా. ఆ ఫ్యాక్టరీ సమకూర్చే అదనపు ఆదాయంతో ఆ పారిశ్రామికవేత్త బ్యాంకులకు వడ్డీ, అసలు చెల్లిస్తాడు. ఈ మదుపు మార్గానికి ప్రత్యామ్నాయంగా ఆ ధనాన్ని, ఆదాయ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఉపయోగించుకోవచ్చు. ఈ పద్ధతిలో రుణగ్రహీతకు అదనపు ఆదాయాలేవీ సమకూరవు. ఫలితంగా వడ్డీని, ఇప్పటికే చాలీచాలకుండా ఉన్న ఆదాయం నుంచే చెల్లించవలసివస్తుంది. ఉద్యోగం కోల్పోయిన ఒక మహిళా ఉద్యోగి విషయాన్ని చూద్దాం. ఆమె తన కుటుంబ నిర్వహణకు అప్పు చేస్తుంది. కొద్ది నెలల అనంతరం ఆమె అదే ఉద్యోగంలో అదే వేతనంతో చేరే అవకాశం లభిస్తుంది. అయితే ఇప్పుడు ఆమె తనకు ఉద్యోగం లేనికాలంలో చేసిన అప్పుపై వడ్డీని ఇంతకు ముందున్న ఆదాయం నుంచే చెల్లించవలసి ఉంటుంది. దీంతో అనివార్యంగా ఆమె జీవనప్రమాణాలు పడిపోతాయి. ఆదాయంలో పెరుగుదల లేకపోవడంతో పాటు అదనంగా వడ్డీ చెల్లించవలసిరావడమే ఆమె కష్టాలకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మన ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలు ఉద్యోగం కోల్పోయిన కాలంలో ఆ మహిళా ఉద్యోగి తీసుకున్న రుణం లాంటివే. కొత్త మదుపుల కోసం కాకుండా, ప్రభుత్వ వినియోగాన్ని ఒడుదుడుకులు లేకుండా నిర్వహించేందుకే మన పాలకులు రుణాలు తీసుకుంటున్నారు. ఈ విధానం దీర్ఘకాలంలో పలు సమస్యలకు దారితీస్తుందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. రుణాల ద్వారా సమకూర్చుకున్న ధనాన్ని అమెరికా, చైనా భిన్నవిధాలుగా వినియోగించుకుంటున్నాయి. అమెరికా, ఆ ధనాన్ని నేరుగా తన పౌరులకు బదిలీ చేసి వారి కొనుగోలు సామర్థ్యాన్ని పెంపొందిస్తోంది. అలాగే కొత్త సాంకేతికతల అభివృద్ధికి కూడా భారీగా వినియోగిస్తోంది. అదే విధంగా చైనా కూడా రుణాల రూపేణా సమకూర్చుకున్న ధనాన్ని అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలకు లేదా సొంత ఫైటర్ జెట్స్ తయారీకి వినియోగిస్తోంది. చెప్పవచ్చిందేమిటంటే అమెరికా, చైనా తీసుకుంటున్న రుణాలు పారిశ్రామికవేత్త తీసుకుంటున్న రుణాలవంటివి కాగా మన ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలు ఉద్యోగం కోల్పోయిన ఉద్యోగిని తీసుకున్న రుణం లాంటివి! 2021 ఏప్రిల్‌లో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు రూ. 1.41 లక్షల కోట్లు. ఈ వసూళ్లు 2021 మార్చిలో రూ. 1.23 లక్షల కోట్లు కాగా గత రెండు సంవత్సరాలుగా నెలకు రూ. 1.0 లక్ష కోట్లుగా ఉన్నాయి. తమ ఆర్థిక భవిష్యత్తు సానుకూలంగా ఉంటుందని మెక్ కిన్సే సంస్థ 2021 జనవరిలో మన దేశంలో నిర్వహించిన ఒక సర్వేలో 86 శాతం మంది అభిప్రాయ పడ్డారు. అయితే 2021 ఏప్రిల్‌లో అదే సంస్థ నిర్వహించిన సర్వేలో కేవలం 64 శాతం మంది మాత్రమే తమ ఆర్థిక భవిష్యత్తు సానుకూలంగా ఉండగలదని భావించారు. 'పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్' (పిఎంఐ) పడిపోయినట్టు ఒక పరిశోధనా పత్రం వెల్లడించింది. ఆర్థిక భవిష్యత్తుపై వ్యాపార సంస్థల పర్చేజ్ మేనేజర్లు సానుకూల దృక్పథం కలిగి ఉన్నారనడానికి 50ం పిఎంఐ సూచన కాగా, 50– పిఎంఐ అనేది వారి ప్రతికూల దృక్పథానికి సూచన. 2021 మార్చిలో 34.6 నుంచి 2021 ఏప్రిల్‌లో 54.0కి పిఎంఐ పడిపోయినట్టు ఒక సర్వే వెల్లడించింది. 2021 మార్చిలో కంటే 2021 ఏప్రిల్‌లో పెట్రోల్ వినియోగం 6.3 శాతం, డీజిల్ వినియోగం 1.7 శాతం, కార్ల విక్రయాలు 7 శాతం, అంతర్–రాష్ట్ర ఈ%--%వే బిల్లుల జారీ 17 శాతం మేరకు తగ్గిపోయాయి. అంటే మార్చితో పోల్చినప్పుడు ఏప్రిల్‌లో మౌలిక సూచికలు అన్నీ అధోముఖంగా ఉన్నాయి. మరి ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్ల పెరుగుదలలో మర్మమేమిటి? జీఎస్టీ వసూళ్ల సమాచారాన్ని ఘనంగా చూపేందుకు ప్రభుత్వరంగ సంస్థలన్నీ ముందస్తుగా వస్తుసేవల పన్నును చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించి ఉండవచ్చని నేను భావిస్తున్నాను. ఈ విషమ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ కింద పేర్కొన్న చర్యలను తప్పనిసరిగా చేపట్టాలి. చమురు దిగుమతులపై సుంకాన్ని భారీగా పెంచాలి. పెట్రోల్ ధర లీటర్ రూ. 150 ఉండేలా చమురు దిగుమతి సుంకాలను నాలుగు రెట్లు పెంచాలని నేను గట్టిగా సూచిస్తున్నాను. అలాగే డీజిల్ ధరలో కూడా భారీ పెరుగుదల అవశ్యం. ఈ ధరల పెరుగుదల వల్ల పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం గణనీయంగా తగ్గుతుంది. చమురు ధరల పెరుగుదలతో సమకూరే ఆదాయాన్ని రుణభారాన్ని తగ్గించుకునేందుకు వినియోగించుకోవాలి.

# వ్యాక్సిన్ల వెతలు తీరేనా?



ప్రతిఒక్కరికీ, ముఖ్యంగా పేదలకు భద్రత సమకూరనంతవరకు ఏ ఒక్కరికీ భద్రత ఉండదు. కరోనా వైరస్ మహా వేగంగా ఉత్పరివర్తనాలు చెందుతున్న విషమ కాలమిది. ఆ విషక్రిమి బహురూపాలలో మానవాళిని మృత్యుతిప్పలు పెడుతోంది. వైరస్ ఉధృతికీ, వ్యాక్సినేషన్ వేగానికీ మధ్య జీవన్మరణ పోటీ నెలకొంది. సంపూర్ణ విజయం లేదా వినాశనకర వైఫల్యం అంచున మానవాళి నిలబడి ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచ ప్రజలకు 1100 కోట్ల డోసుల టీకాల ఆవశ్యకత ఉంది. సాధ్యమైనంత త్వరగా పేదప్రజలకు, మారుమూల ప్రాంతాలకు ఈ వ్యాక్సిన్లు అందవలసి ఉంది. లేనిపక్షంలో ఈ ధరిత్రిపై సర్వత్రా కరోనా వైరస్ వ్యాపిస్తుంది. ఉత్పరివర్తనాలతో మళ్లీ మళ్లీ విజృంభించి ఆరోగ్య భీములను సైతం దుర్బలపరచడం ఖాయం. ఇప్పుడు సమస్య వ్యాక్సిన్ల గురించి లేదా వాటిని ఉత్పత్తి చేయడంలో ప్రపంచ సామర్థ్యం గురించి కానేకాదు. ప్రపంచ శాస్త్రవేత్తలు రెండు వందలకు పైగా వ్యాక్సిన్లను అభివృద్ధిపరుస్తున్నారు. 102 వ్యాక్సిన్లు క్లినికల్ ట్రయల్స్ దశకు చేరాయి. ప్రస్తుత సంవత్సరం ముగిసేనాటికి 1400 కోట్ల డోసుల వ్యాక్సిన్లను ప్రపంచం ఉత్పత్తి చేయగలుగుతుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. 300 కోట్ల డోసులను ఉత్పత్తి చేసేందుకు చైనా సంస్థలు సైనో ఫార్మా, సైనో వ్యాక్ సంసిద్ధమవుతున్నాయి. అమెరికాకు చెందిన ఫైజర్%--%–బయో ఎన్‌టెక్ తన వ్యాక్సిన్ ఉత్పాదక సామర్థ్యాన్ని 300 కోట్లకు పెంచుకుంది. అలాగే ఆక్స్‌ఫర్డ్%--% ఆస్ట్రాజెనెకా కూడా. ఇలాగే ఇంకా ఎన్నో సంస్థలు టీకాల ఉత్పత్తిలో పురోగమిస్తున్నాయి. చెప్పవచ్చిందేమిటంటే వ్యాక్సిన్లకు కొరతేమీ లేదు. వ్యాక్సిన్ల ధరలతోనే సమస్య. అత్యధిక ప్రజలకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలి కదా. ప్రస్తుతం వ్యాక్సిన్ల ధరలు చాలా మందికి ఆందోళన కలిగిస్తున్నాయి. ఉత్పత్తిదారులేమో లాభాలను మరింతగా దండుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. మీడియా వార్తల ప్రకారం ఒక్కో డోసును రెండున్నర డాలర్ల (దాదాపు 200 రూపాయలు) నుంచి 20 దాకా విక్రయిస్తున్నారు. అన్నిటిలోకి ఆక్స్‌ఫర్డ్–%--%ఆస్ట్రాజెనెకా టీకా చాలా చౌకగా అందుబాటులో ఉంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ టీకా ఒక్కో డోసుకు యూరోపియన్ యూనియన్ రెండున్నర డాలర్లు చెల్లిస్తుండగా దక్షిణాఫ్రికాలో అదే టీకా డోసు ధర ఐదు డాలర్లకు పైగా ఉంది. సైనో ఫార్మా వ్యాక్సిన్ డోసు ధర శ్రీలంకలో 15 డాలర్లు కాగా బంగ్లాదేశ్‌లో 10 డాలర్లు. ఈ టీకాను ఆయాదేశాల ప్రభుత్వాలే కొనుగోలు చేస్తున్నాయి. ఇక అర్జెంటీనాలో ఒక్కో డోసును రూ. 40 డాలర్లకు సైనో ఫార్మా విక్రయిస్తోంది. మోడెర్నా టీకా డోసు ధర 37 డాలర్లు. ఈ పరిస్థితిలో వ్యాక్సిన్ అసమానతలు స్వతసిద్ధమే కాక అనివార్యం కూడా. వ్యాక్సిన్ ధరలను భరించగల ఆర్థికస్తోమత పేద దేశాలకు లేదు. 100 కోట్ల మంది ప్రజలకు ఉచిత టీకా సదుపాయం కల్పించాలని ఇటీవలే నిర్ణయం తీసుకున్న భారతప్రభుత్వం 44 కోట్ల డోసులకు మాత్రమే ఆర్డర్ ఇచ్చింది (పూర్తి అవసరం 200 కోట్ల డోసులు). సీరం ఇన్‌స్టిట్యూట్ ఉత్పత్తి కొవిషీల్డ్, భారత్ బయోటెక్ ఉత్పత్తి కొవాగ్జిన్ టీకాలను ఒక్కో డోసు రూ. 150 (2 డాలర్లు) చొప్పున కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే మహమ్మారి మూలంగా వాటిల్లిన నష్టాలతో అతలాకుతలమైన దేశ ఆర్థికవ్యవస్థపై, ఈ టీకాల కొనుగోలు మరింత భారాన్ని మోపుతోంది. అయితే ప్రతి డోసును తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నందున ప్రభుత్వం చేపట్టిన సార్వత్రిక టీకాకరణ కార్యక్రమాన్ని భరించగల శక్తి మన ఆర్థికవ్యవస్థకు ఉంది. మరి బంగ్లాదేశ్, కెమరూన్ మొదలైన పేదదేశాల మాటేమిటి? వ్యాక్సినేషన్ భవిష్యత్తుకు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి%--%జర్మనీ, బ్రిటన్ అనుసరిస్తున్న మార్గం. ఈ దేశాల ప్రభుత్వాలు తమ కంపెనీల నుంచి వ్యాక్సిన్లను కొనుగోలు చేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేసిన కొవ్యాక్స్ సంస్థకు విరాళంగా ఇస్తున్నాయి. తమ అవసరాలకు మించి కొనుగోలు చేసిన 10 కోట్ల టీకాలను కొవ్యాక్స్‌కు విరాళంగా ఇవ్వనున్నట్టు ఇటీవల ముగిసిన జి7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆతిథేయి బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆర్భాటంగా ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి వాటిని అందజేస్తామని ఆయన తెలిపారు. అమెరికా మరో 50కోట్ల డోసులను ఇవ్వనున్నది. మొత్తం మీద 2022 మధ్యనాళ్ళకు జి7 దేశాలు 199 కోట్ల డోసులను ప్రపంచ దేశాలకు ఉచితంగా ఇచ్చేందుకు వాగ్దానం చేశాయి. అయితే ఈ సహాయం చాలా స్వల్పమైనది. అంతేకాదు, చాలా ఆలస్యంగా అందనున్న సాయమిది. ఆఫ్రికా ఖండంలో కొవిడ్ కేసులు ఇప్పటికే బాగా పెరిగిపోయాయి. మరో ముఖ్యమైన విషయమేమిటంటే సార్వత్రిక టీకాకరణకు అయ్యే వ్యయాన్ని భరించేందుకు ప్రపంచదేశాల వద్ద ఒక సమష్టి ప్రణాళిక ఏమీ లేదు. కనుకనే కొవ్యాక్స్ ఇప్పటికీ వ్యాక్సిన్ల కొరతను ఎదుర్కొంటోంది. సరఫరాల విషయంలో సంపన్నదేశాల వాగ్దానభంగాలను చవిచూస్తోంది. ఇక రెండో ప్రత్యామ్నాయం టీకాలపై మేధా సంపత్తి హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడం. దీనివల్ల ఇతర కంపెనీలు కూడా వ్యాక్సిన్లను భారీ ప్రమాణంలో ఉత్పత్తి చేయడం సాధ్యమవుతుంది. హెచ్ఐవి, ఎయిడ్స్ మందుల విషయంలో ఇలాగే జరిగింది. మేధా సంపత్తి హక్కులను రద్దుచేయడం వల్ల టీకాల ధర గణనీయంగా తగ్గిపోతుంది.. ధరల తగ్గుదలతో టీకాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఇది, మహమ్మారిపై మానవాళి సమష్టిపోరు అవుతుంది. ఈ సమైక్యసమరం నిజం కావాలంటే ప్రజాస్వామ్యం పట్ల తన నిబద్ధతను 'స్వేచ్ఛా ప్రపంచం' మరింత ఆచరణాత్మకంగా నిరూపించుకోవాలి. 'నిరంకుశ ప్రభుత్వాల'కు వ్యతిరేకంగా పోరాడాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ వ్యవస్థలలో ప్రజలకు నిజమైన సాధికారతను తాను ఎలా పునరుద్ధరించనున్నదీ అమెరికా చూపి తీరాలి. మనం మార్కెట్‌కు ప్రాధాన్యమిచ్చి రాజ్యవ్యవస్థను ఎంతగా బలహీనపరచాలో అంతగా బలహీనపరిచాం. మార్కెట్ మరింత శక్తిమంతమయితేనే సమాజాలు సాధికారత పొందుతాయని మనం విశ్వసిస్తున్నాం. అయితే మన విశ్వాసం ఫలిస్తుందా? ఫలిస్తుందని నేను భావించడం లేదు. రాజ్యం–మార్కెట్%--%వినియోగదారీ సమాజం సంయుక్తంగా ఇటువంటి పరిస్థితులను తీసుకువచ్చాయి. ప్రజాసాధికారితను పునరావిష్కరించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ కాలంలోనూ, ఆ విపత్తు అనంతర కాలానికీ ఇది చాలా ముఖ్యం.

## వలిగొండ మండలంలో 4గురికి కరోనా పాజిటివ్

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని వలిగొండ,వర్కట్ పల్లి,వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం 540 మందికి కరోనా ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా అందులో 4గురికి పాజిటివ్ నిర్ధారణ అయిందని,వారికి కరోనా పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలిపి,వారిని హెూమ్ క్వారెంటైన్ చేశామని డాక్టర్లు సుమన్ కళ్యాణ్,కిరణ్ కుమార్,స్వామి లు తెలిపారు.

## జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ దోరపల్లి లక్ష్మీ రవీందర్ కు ఘన స్వాగతం తెలిపిన టీఆర్ఎస్ నాయకులు



మేడిపల్లి, జూన్25 (ప్రజాపాలన ప్రతినిధి) :జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ దోరపల్లి లక్ష్మీ రవీందర్ కు హబ్సిగూడలో టీఆర్ఎస్ నాయకులు జెసిబి రాజు ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు .చైర్మన్ గా ఎన్నికైన అనంతరం తొలిసారిగా నగరానికి వచ్చిన చైర్మన్ దోరపల్లి లక్ష్మీ రవీందర్ కు టీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేపాక కుమార స్వామి ,కొడపర్తి రామచంద్ర చారి ,సూరం శంకర్ ,విజయ్ ,శివ ,లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత



జగిత్యాల, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల రూరల్ మరియు అర్బన్ మండలాలకు చెందిన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో 63 మంది లబ్ధిదారులకు 22 లక్షల రూపాయల చెక్కులను జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దామోదర్ రావు పాక్స్ చైర్మన్లు మైపాల్ రెడ్డి సందీప్ రావు బాల ముకుందం సర్పంచ్లు ఎంపీటీసీలు మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాలలోని ఎస్విఎల్ఆర్ గార్డెన్ లో జగిత్యాల రూరల్ మరియు అర్బన్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి షాదిముబరక్ చెక్కులను 99 మంది లబ్ధిదారులకు కోటి రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంతసురేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రురల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్ పాక్స్ చైర్మన్లు మైపాల్ రెడ్డి సందీప్ రావు బాల ముకుందం సర్పంచ్లు ఎంపీటీసీలు మరియు నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పొడి దుక్కిలో వరి విత్తే విధానం పై రైతులకు అవగాహన సదస్సు

### మల్లాపూర్ వ్యవసాయ అధికారి లావణ్య

మల్లాపూర్, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి):మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట్ రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నేరుగా పొడి దుక్కిలో వరి విత్తే విధానం పై రైతులకు అవగాహన సదస్సును వ్యవసాయ అధికారి లావణ్య నిర్వహించడం జరిగింది. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో అవసరానికంటే ఎక్కువ నీరు వరిసాగులో వాడడం వల్ల భూములు తమ పోషకత్వాన్ని సహజ స్వరూపాన్ని కోల్పోయి ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గి వరిసాగుకు గిట్టుబాటు కాకుండా పోతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని ఆదా చేసి ఎక్కువ దిగుబడి తక్కువ నీటితో సాధించడం అత్యవసరం. వరిని మనం సాధారణంగా పండించే మొక్కజొన్న నువ్వులు, సోయా, చిక్కుడు, వంటి పంటల మాదిరి ఆరుతడి పరిస్థితుల్లో పండించవచ్చు అని అన్నారు. రైతులకు వరి సాగు పై సందేహాలు తిరుస్తూ పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతడుపుల నాగరాజు, ఎంపిటిసి ఓస సత్తెమ్మ, ఉప సర్పంచ్ సామ రవి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాధా, వంశీ, గజానంద్, ఆత్మ , ఏటీఎం నవిత, రైతులు రాజా రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శేఖర్, జలంధర్, గణేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మిరియాల నారాయణ గుప్తా 29 వ జయంతి సందర్భంగా నివాళులు

మధిర,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: తాలూకా రేమిడిచర్ల గ్రామంలో 1893 వ సంవత్సరంలో బీద ఆర్య వైశ్య కుటుంబంలో జన్మించి బ్రతుకు తెరువు కోసం మధిరకు వచ్చి నివాసం ఏర్పరచుకొన్న మహా మనిషి మిరియాల నారాయణ గుప్తా గారు. ఆనాటి స్వాతంత్రోద్యమంలో స్వయంగా పాల్గొని నాటి నాయకులైన జలగం వెంగళరావు, శీలం సిద్ధారెడ్డి, బొమ్మకంటి వారలకు మార్గదర్శకంగా ఉండి దిశానిర్దేశం చేసిన మహనీయుడు శ్రీ మిరియాల నారాయణ గుప్తా గారు. ఆరోజుల్లో పూజ్య బాపూజీ తో బహిరంగ సభ ఏర్పాటు చేసిన గాంధేయవాది. స్వాతంత్రోద్యమంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబం వారిద మధిరలో వర్తక సంఘం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం, రిక్రియేషన్ క్లబ్, గర్ల్స్ హై స్కూల్, బాపూజీ హరిజన హాస్టల్ మరియు గ్రంథాలయం తదితర సంస్థలకు భావి తరాలకు ఉపయోగపడే విధంగా స్థల సేకరణ జరిపి మధిర ప్రజలకు అందించిన మహనీయుడు శ్రీ మిర్యాల నారాయణ గుప్తా. 1982 లో కీర్తి శేషులు అయ్యారు నారాయణ గుప్తా వారు మధిర సమాజానికి చేసిన సేవలను గుర్తించి శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రతి సంవత్సరం జయంతి మరియు వర్ధంతి వేడుకలను జరుపుకుంటున్నారు శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం నిర్వహణ కమిటీ వారు వారు చేసిన సేవలు మధిర భావితరాలకు శాశ్వతంగా గుర్తుండిపోయే విధంగా మధిర-అంబారుపేట చెరువు కట్ట త్వరలో ట్యాంక్ బండ్ గా మారబోతున్నందున ఆ ట్యాంక్ బండ్ కి శ్రీ మిరియాల నారాయణ గుప్తా ట్యాంకుబండు గా నామకరణం చేసి వారి పేరును భావితరాలు స్మరించుకునే విధంగా చేసినట్లయితే వారికి సముచిత గౌరవం కల్పించిన వారవుతారని భావిస్తున్నాము. ఈరోజు శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం లోని మిరియాల నారాయణ గుప్తా గారి విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవించుకుంటూ ఉన్న వేళ వారికి మా హృదయపూర్వక నివాళులు అర్పించిమరియు జోహార్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు మాట్లాడుతూ విద్యావంతులుగా రాజకీయవేత్తగా అనేక అనేక సేవలు తత్వంతో జిల్లాలోనే ఆర్యవైశ్య వైశ్యుడిగా జిల్లాలో మధిర నియోజకవర్గంలో అన్ని అర్హతలూ ఉన్న నాయకుడిగా గుప్తా గారు అనేక సేవా దృక్పథంతో ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు అనంతరం మదర్ లో అనేక కార్యక్రమాలు చేశారు ఈ కార్యక్రమంలో మిర్యాల రమణగుప్తా రంగా హనుమంతరావు ఇరుకుళ్ళ లక్ష్మీనరసింహారావు, రంగా అప్పారావు, కృష్ణచారుగుండ్ల



నరసింహమూర్తి, పల్లపోతు ప్రసాద రావు, మిరియాల కాశీ విశ్వేశ్వర రావు, యర్రా లక్ష్మణ్, కుంచం కృష్ణారావు, ఇరుకుళ్ళ సురేష్, వెచ్చా వెంకటరంగారావు, పుల్లఖండం చంద్రశేఖర్ రిటైర్డ్ ఎండీపీ. నాగ గేశ్వరావు విశ్వనాథ పాల్గొన్నారు.

## కేంద్ర సహకార బ్యాంక్ లీ. నగదు రహిత లావాదేవీలపై అవగాహన సదస్సు



సారంగాపూర్, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా వ్యవసాయ సహకార బ్యాంకు లీ. ఛైర్మన్ ఏలేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో చైర్మన్ బ్యాంక్ మేనేజర్ ఎండి మొయిజ్ ఫాష ఫీల్డ్ అఫిసర్ రాకెష్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బ్యాంక్ ఖాతాదారులకు తెలియజేస్తూ నగదు రహిత లావాదేవీలు తప్పకుండ అవసరమని బ్యాంకుల వద్ద ఖాతాదారులు క్యూ లైన్లో నిలబడి సమయాన్ని వృధా చేసుకోకుండ ఎటిఎం కార్డుతో మరియు ఫోన్ ఫే గూగుల్ ఫే నేట్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు ఇంటివద్ద నుండి నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. 18 నుండి 50 సంవత్సరాలు నిండిన ఖాతాదారులు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకంలో సంవత్సరానికి 330 రూపాయలు చెల్లిస్తే సాధారణ మరణానికి 2 లక్షల భీమా వర్తిస్తుందని మరియు 18 నుండి 70 సంవత్సరాలు నిండిన ఖాతాదారులు ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజనలో సంవత్సరానికి 12 రూపాయలు చెల్లిస్తే ప్రమాద మరణం సంభవించన 2 లక్షల భీమా వర్తింస్తుందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు గుర్రాల రాజేందర్ రెడ్డి సీఈవో ఇస్మాయిల్ డైరెక్టర్లు కొండ్ర రాంచందర్ రెడ్డి కాయితి శేఖర్ రెడ్డి ఏఈవో వేముల వెంకటేష్ సిబ్బంది భూమేష్ ఖాతాదారులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన



ఇబ్రాహీంపట్నం, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా శుక్రవారం మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీ సంకెళ్ళతో నిరసనతెలియజేసారు. 1975 జూన్ 25న మొదలైన ఎమర్జెన్సీ 21 నెలలు కొనసాగింది. నాడు జన సంఘ్ పేరుతోఉన్న భారతీయ జనతా పార్టీ నాయకులను సామాన్య జనాలను ఇబ్బందులకు గురిచేస్తూ ఇందిరా గాంధీ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా అత్యవసర పరిస్థితి విధించి అరాచకానికి గురిచేశారు, భారతీయ జనతా పార్టీ ప్రతి ఏటా ఎమర్జెన్సీ చీకటి పాలనగురించి ప్రజలకు వివరించి భారత రాజ్యాంగం మరియు ప్రజాస్వామిక విలువలు కాపాడేందుకు కృషిచేస్తుంది. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం బీజేపీ అధ్యక్షులు బట్టు జక్రయ్య, ఉపాధ్యక్షులు ఉడుత రాజు, కార్యదర్శి సావర్తి వేణు గోపాల్, కోశాధికారి సుంచు రణధీర్, బీజేవైయం మండల అధ్యక్షులు బోడ నవీన్ రెడ్డి, జగిత్యాల జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తీగల శ్రీధర్ రెడ్డి, దళిత మోర్చా కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, చాట్ల రాజేందర్, గోపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ బాలికకు ఆర్థిక సహాయం అందించిన లయన్స్ క్లబ్



ఇబ్రహీంపట్నం, జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన వెంకటేష్ కొనెళ్ల క్రిందట చనిపోయారు. ఇటీవల ఆయన భార్య సుమలత కూడా అనారోగ్యంతో మృతి చెందినారు. తల్లి మృతితో కూతురు కావేటి స్వాతి (13) అనాథగా మిగిలింది. ఆ బాలికకు లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం తరుపున తక్షణ సహాయం కింద రూ. 5 వేలు ఆర్థిక సహాయంచేశారు. బాలికకు అన్నివిధాలుగా అండగా ఉంటామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నేమురి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉటూరి ప్రదీప్, జె.డి.సుమన్, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, బద్దం గోపి, జింక శ్రీను, రెబ్బటి రాజా శేఖర్ యాదవ్, నేమురి నరేష్, పొడిటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు విజయవంతం ..



పాలేరు జూన్ 25 (ప్రజాపాలన ప్రతినిధి) : ఖమ్మం జిల్లా:- పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు విజయవంతం గా ముగించినందుకు కూసుమంచి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి,కలెక్టర్ కర్ణన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో అధికారులు కష్టపడి రైతు లు నష్టపోకుండా ప్రతిగింజ కొనుగోలు చేశారన్నారు.వర్షాకాలం సీజన్ కు రైతులు పంటలు వేసుకునేందుకు సిద్ధం కావాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్ వీ కర్ణన్ ను ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు,టిఆర్ఎస్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు ఉన్నాం బ్రహ్మయ్య, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, కూసుమంచి మండలం పార్టీ అధ్యక్షులు చాట్ల పరుశురాం, ఎంపీపీలు బెల్లం ఉమా, బి శ్రీనివాసరావు,డిసిసిబి డైరెక్టర్ ఇంటురి శేఖర్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగబండి శ్రీనివాసరావు, ఆత్మ చైర్మన్ రామసాయం బాలకృష్ణ రెడ్డి, వ్యవసాయ శాఖ మరియు వివిధ రకాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసినప్పుడే వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాం:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### సొంత నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



జిన్నారం, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి:ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసినప్పుడే వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం ఊట్ల గ్రామపంచాయతీ మధిర గ్రామమైన దాది గూడెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మిస్తానని గతంలో గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి వి ఆర్ ఎంటర్ప్రైజెస్ తరపున 25 లక్షల రూపాయల నిధులతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

## విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చేరు,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి:పటాన్చేరు మండలం భానూర్ గ్రామ పరిధిలోని కంచర్ల గూడెం లో జీర్ణోద్ధరణ గావించిన శ్రీ భ్రమరాంబిక కేతకి సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రిక ను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. వచ్చే నెల 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యే సొంత నిధులతో సిసి రోడ్ల నిర్మాణ స్థలంను పరిశీలించిన జడ్పిటిసి కుమార్ గౌడ్



గుమ్మడిదల,25జూన్ 21,,,గుమ్మడిదల మండలం లోని రాంరెడ్డిభాయి గ్రామంలో సీసీ రోడు నిర్మాణ స్థలాన్ని జడ్పీపిసి కుమార్ గౌడ్ పరిశీలించారు ఆయన మాట్లాడుతూ సుమారు 45 లక్షల రూపాయల విలువ గలా పనులు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో కిలోమీటర్ మేరా సీసీ రోడ్ నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మన పటాన్చేర్ శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి గ్రామాల అభివృద్దే ధ్యేయంగా ఖర్చుకు వెనకడకుండా తన సొంత నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం హర్షించదగ్గ విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సద్ది విజయభాస్కర్ రెడ్డి,నక్క వెంకటేష్ గౌడ్,దామోదర్ రెడ్డి, పద్మారెడ్డి,కర్ణాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి అవు మృతి



గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన రైతు నీరుడి శేఖర్ కు చెందిన ఆవు రోజు లాగే శుక్రవారం వాటిని మేత కోసం వెళ్లగా కూడా పోతాన్ కుంట చెరువు లోకి నీళ్లు తాగడం కోసం వెళ్లి చెరువులో గుంతలు లోతుగా ఉండడంతో ఆవు పడిపోయి, అక్కడిక్కడే మృతి చెందిందని రైతు శేఖర్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ చెరువులో గుంతలను ఎక్కువ లోతుగా తీయడం వల్ల తమ ఆవు చనిపోయిందనీ ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వం తమ కు నష్టపరిహారం చెల్లించాలని అధికారులను కోరారు.

# పి హెచ్ సి కి ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను అందజేసిన పోతినేని సుదర్శన్ రావు, పసుమర్తి రంగారావు

బోనకల్లు, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి:ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావుమండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేతన ఫౌండేషన్ సంస్థ స్పందించిన ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. చేతన పౌండేషన్ సంస్థ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు లక్ష రూపాయల విలువ చేసే ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను ఉచితంగా బహూకరించింది. దీనిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ఆ సంస్థ కార్యదర్శి పసుమర్తి రంగారావు మండల ప్రాథమిక వైద్యాధికారి తాటికొండ శ్రీకాంత్ కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోతినేని మాట్లాడుతూ కరోనా వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, ప్రజల ఆరోగ్యం కోసమే తాను చేతన ఫౌండేషన్ సంస్థను సంప్రదించినట్లు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ సమస్యను గూగులోతు రామకృష్ణ తన దృష్టికి తీసుకు వచ్చారని దీంతో తాను ఫౌండేషన్ సంస్థ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహకారం గా ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను ఉచితంగా అందించినందుకు సంస్థకు ఆయన న కృతజ్ఞతలు తెలిపారు. చేతన పౌండేషన్ సంస్థ జిల్లా వ్యాప్తంగా అనేక రూపాలలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేయూత అందిస్తున్నారన్నారు. చేతన పౌండేషన్ మండల ప్రజలు అందరికీ ఉపయోగపడే ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. సంస్థ నిర్వహించే అన్ని సేవాకార్యక్రమాలకు సిపిఎం పార్టీ అన్ని వేళల అవసరమైన సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. మండల ప్రాథమిక వైద్యాధికారి తాటికొండ శ్రీకాంత్ తో పాటు వైద్య సిబ్బంది మండల ప్రజలకు కరోనా సమయంలో ఎంతో విలువైన వైద్య సేవలను అందించారని వైద్య సిబ్బంది అందరిని పోతినేని సుదర్శన్ రావు ప్రత్యేకంగా అభినందించారు. చేతన పౌండేషన్ ఇచ్చిన అవకాశాన్ని ప్రజలందరకి ఉపయోగించి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. దీనిని సద్వినియోగంగా వినియోగించుకొని ఇంకా ఏదైనా అవసరమైతే చైతన్య ఫౌండేషన్ ద్వారా అందించేందుకు తాము కృషి చేస్తామని వైద్య సిబ్బందికి హామీ ఇచ్చారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసమే అందించాం- పసుమర్తి రంగారావు మండలంలో కరోనా ప్రభావం అధికంగా ఉందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కోసమే తమ సంస్థ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను అందిస్తున్నట్లు చేతన పౌండేషన్ కార్యదర్శి పసుమర్తి రంగారావు తెలిపారు. దీనిని పూర్తిస్థాయిలో మంచిగా వినియోగించుకుంటే ఇంకా ఏదైనా అవసరం ఉంటే తాము తప్పకుండా ప్రజల కోసం అందజేస్తామని తెలిపారు. వైద్యాధికారి సిబ్బంది కరోనా సమయంలో ప్రజలకు విలువైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పోతినేని సుదర్శన్ రావు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎవరైనా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే తమ సంస్థ 50 శాతం భరిస్తుందని మిగిలిన 50 శాతం నిర్వాహకులు భరించాల్సి ఉంటుంది అన్నారు. తాము ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే కార్యక్రమాలకు మాత్రమే సహకారం అందిస్తామని, వ్యక్తిగత ప్రయోజనాలకు ఎటువంటి సహాయ సహకారాలు అందించమన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మండల ప్రజలకు దీనిద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని



వైద్య సిబ్బందికి హామీ ఇచ్చారు. సమస్యను గూగులోతు రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామండల వైద్యాధికారి శ్రీకాంత్ మండలంలో కరోనా ఉద్ధృత రూపం లో ఉన్న సమయంలో అనేకసార్లు ఇతరుల వైద్యం కోసం టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గూగులోతు రామకృష్ణ పీహెచ్సీకి వచ్చేవారని మండల ప్రాథమిక వైద్యాధికారి తాటికొండ శ్రీకాంత్ తెలిపారు. ఆక్సిజన్ లేక ఖమ్మం పెద్దాస్పత్రిలో కూడా కరోనాతో అనేక మంది మృత్యువాత పడుతున్నారని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూడా ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ ను దాతల ద్వారా సమకూర్చేందుకు ప్రయత్నించాలని ఆ సమయంలో తాను రామకృష్ణ ను కోరినట్లు తెలిపారు. కొన్ని రోజుల తర్వాత రామకృష్ణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు సాధ్యమైనంతవరకు ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారని తెలిపారు. ఆ కృషి కార్యరూపం దాల్చి పి హెచ్ సి కె ఆక్సిజన్ పరికరం అందజేయటం నాతో పాటు మా సిబ్బంది అందరికీ ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీంతో తాము ప్రజలకు అందిస్తున్న సేవలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తామని, దీనిని వందకు వంద శాతం ప్రజల కోసం జాగ్రత్తగా ఉపయోగిస్తామని అన్నారు. గూగులోతు రామకృష్ణ కృషి మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా చేతన పౌండేషన్, పోతినేని సుదర్శన్ రావు, గూగులోతు రామకృష్ణలకు ఆయన వినయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు సిపిఎం నాయకులు సాధినేని మల్లికార్జునరావు, తెల్లకుల శ్రీనివాసరావు ఉమ్మ నేని రవి, బోయినపల్లి వీరబాబు, కొమ్ము శ్రీనివాసరావు , ముక్కపాటి అప్పారావు , కందిమల్ల రాధ, తుళ్లూరు రమేష్, చెన్నా లక్షాద్రి ,పాపినేని అప్పారావు, ఏసుపోగు బాబు సంస్థ సభ్యులు చంద్రకాని నవీన్, అంతోటి పుల్లారావు, నాగరాజు ,ఈశ్వర్, అచ్యుత్ , పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్లూరు గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి

### సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్



వికారాబాద్ జూన్ 25 ప్రజాపాలన బ్యూరో : గ్రామాభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేనస్తున్నామని పట్లూరు గ్రామ సర్పంచ్ ఇందిర అశోక్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం పనులను పూజా కైంకర్యాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందిర అశోక్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి వార్డులో సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులన్నింటినీ కార్యాచరణ ప్రకారం నిర్వహిస్తామని వివరించారు. అందులో భాగంగానే 3 లక్షల 14వ ఆర్థిక నిధులతో 3వ వార్డులో పి.లాలయ్య ఇంటి నుండి పోచమ్మ దేవాలయం వరకు సీసీ రోడ్ నిర్మాణానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించామని చెప్పారు. గ్రామంలో ఏ సమస్యలైనా అపరిష్కృతంగా ఉంటే వెంటనే నా దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దేవరదేశి అశోక్ ఉప సర్పంచ్ మోహిజ్, ఎంపీటీసీలు స్వప్న సురేష్, మంజుల మహేష్, వార్డ్ మెంబర్స్ నర్సిములు, ఖాజా, నెల్లి ప్రభు, బాలేష్, చావుస్, తెరాస సీనియర్ నాయకులు రవి, శేఖర్ స్వామి, జె. రాచయ్య, ప్రభు, హన్మంత్, పాపయ్య, టి. క్రిష్ణ, అనిల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మధిర,జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న ప్రతి మాదిగ పల్లెల్లో ఘనంగా నిర్వహించాలనీ ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు ఈ రోజు మధిర అ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మధిర నియోజక వర్గ సమావేశానికి కనక పూడి శీను మాదిగ అధ్యక్షత వహించాగ ఏపూర్ వెంకటేశ్వరరావు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ దండోరా ఉద్యమం పేద వర్గాల ఐక్యతకు నాది పలికి అనగారిన వర్గాల ఐక్యతకు చిహ్నం గా మారి ప్రతి పేదవానికి ఆత్మ గౌరవాన్ని నీచ్చి పోరాట స్ఫూర్తిని ఈ రగిలించదనీ ఎమ్మార్పీఎస్ లక్ష్యసాధనలో అతి మ రాజ్యాధికారాన్ని సాధించడం కొరకు నిరంతర పోరాడుతుందని దీనిలో పేదవర్గాల అందరూ మహాజన సోషలిస్టు పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కూరపాటి ప్రభాకర్ మాదిగ జిల్లా నాయకులు రాయవరపు దేవదాస్ మాదిగ చాట్ల రమేష్ మండల అధ్యక్షులు కోట హనుమంతరావు బోనకల్ మండలం అధ్యక్షులుమధిర మండలం అధ్యక్షులు సిద్ది పోగు ప్రసాద్ ఎర్రుపాలెం మండలం అధ్యక్షులు మేకల రమేష్ చింతకాని మండల అధ్యక్షులు రవీందర్ ముదిగొండ మండల అధ్యక్షుడు జొన్నలగడ్ మునేష్ మధిర ఎమ్మెస్ మండల అధ్యక్షుడు వేల్పుల పవన్ కళ్యాణ్ %ఎవూా% నాయకులు నాగరాజ్ గోవింద్ ఏ నూక మాదిగ తదితరులు పాల్గొన్నారు

## రాయితీలు నిలిపివేసి రైతుబంధు ఇస్తున్నారు:ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జన్నారం జూన్ 25 ప్రజా పాలన ప్రతినిధి :ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు పనిముట్ల పై రాయితీలు దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణాలకు రాయితీలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రంలో రాయితీలను నిలిపివేసి టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐబి గెస్ట్ హౌస్ లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి తీర సమయానికి రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేయలేక పోయిందని అన్నారు. రైతులు బ్యాంకు రుణాలను చెల్లించక పోవడంతో రైతుబంధు రూపాయలను బ్యాంక్ అధికారులు అప్పు కింద జమ చేసుకుంటున్నారని అన్నారు. బ్యాంక్ అధికారుల చర్యలవల్ల మనస్థాపంతో ఇద్దరు గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యలు ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్య లేనని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలపై ఎస్టి కమిషన్ కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే రైతులు పండించిన వరి ధాన్యాన్ని తాలు పేరుతో కోతలు విధిస్తూ మిల్లర్ల తో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారన్నారని, కంప్యూటర్ కాంట ద్వారా తూకం వేయాల్సి ఉండగా మిల్లర్లు వేసిన కాంతుల తోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారని తెలిపారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూపాయలు 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వరి ధాన్యాన్ని తూకం వేయడంలో కింటాల్ కు రూపాయలు 40 రైతుల వద్దనే వసూలు చేస్తున్నారని , లారీ కిరాయి లు కూడా రైతుల వద్ద నుండే వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్సాగర్ రావు ఉట్నూర్ జెడ్ పి టి సి చారులత రాథోడ్ ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ భరత్ చౌహాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభుదాస్ పసి పుల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి మండల నాయకులు ఇమ్రాన్ ఖాన్ ఇంద్రయ్య పాల్గొన్నారు,

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం సంబంధించిన అనుబంధ దేవాలయం వెంకటాపురం గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రోజున హోమం బలిహరణం పూర్ణాహుతి చక్ర తీర్థం ధ్వజ పట ఉద్వాసన మూగ బలి దేవతోద్వాసన శ్రీ పుష్ప యాగం ఏకాంత సేవలు కార్యక్రమం యాజ్ఞ్యచార్య ప్రతాపురం మత్స్యగిరి స్వామి అర్చక బృందంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.రవి కుమార్,ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, ధర్మకర్తలు,గ్రామ సర్పంచ్ కొత్త నరసింహ,ఆలయ అర్చకులు,సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మరియమ్మ లాకప్ డెత్ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (ప్రజా పాలన) : ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్ల గూడెం గ్రామానికి చెందిన దళిత మహిళ మరియమ్మ లాకప్ డెత్ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దినకర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ లో ఇటీవల దొంగతనం కేసు మోపబడిన అంబటిపూడి మరియమ్మ అనే దళిత మహిళ పోలీస్ స్టేషన్ లో లాకప్ డెత్ కు గురైన సంఘటనపై ప్రభుత్వం తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసుతో పాటు అత్యాచారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ 25 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మరియమ్మ లాకప్ డెత్, ఆమె కుమారుడు ఉదయ్ లను అతి కిరాతకంగా దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి 3 ఎకరాల ప్రభుత్వ భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు తో పాటు, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జాడి తిరుపతి, దుర్గం కైలాస్ లు ఉన్నారు.




ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| సిహెచ్.ఆంజనేయులు | పరిగి | 966410714 |
| గొట్టె సురేందర్ | మంచిర్యాల టౌన్ | 9248528680 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| ఓవి.దుర్గారావు | భద్రాద్రి కొత్తగూడెం | 9581872881 |
| జె.రాంబాబు | అశ్వరరావుపేట | 9505678245 |
| బి.శ్రీకాంత్ | భద్రాచలం | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | సుజాతనగర్ | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కె.సత్యం | పటాన్‌చెరు | 9866500289 |

**బిసి నోట్‌బుక్**



# జాతీయ మానవ హక్కుల కమిషన్

## ఆర్టికల్ 366: నిర్వచనాలు

సందర్భానుసారంగా ప్రత్యేక అర్థం ధ్వనించని యెడల, ఈ రాజ్యాంగ పరిధిలో కొన్ని పదాలకు అర్థం ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) వ్యవసాయ ఆదాయము : ఆదాయపు పన్నుకు సంబంధించిన శాసనములలో నిర్వచించబడిన 'వ్యవసాయ ఆదాయం' అని అర్థం.

2) ఆంగ్లో ఇండియన్ : పూర్వీకులు యూరోపియన్ సంతితవారైనప్పటికీ భారతదేశంలో జన్మించి, భారతదేశములో స్థిర నివాసమేర్పరచుకొనిన వ్యక్తి.

3) ఆర్టికల్ అనగా ఈ రాజ్యాంగంలోని ఆర్టికల్.

4) ఋణము తీసుకొనుట: అనగా ఋణ పత్రములను విడుదల చేయుట ద్వారా సేకరించబడిన సొమ్ము అని అర్థము. 'లోను' అనే పదానికీ ఇదే విధమైన అర్థం ధ్వనిస్తుంది.

5) క్లాజు : అనగా ఆర్టికల్‌లోని ఉపవిభాగములు లేక అంశములు (ఉపనిబంధన అని అనువదించుకోవచ్చు).

6) కార్పోరేట్ పన్ను: అనగా కంపెనీలు తమ ఆదాయంపై చెల్లించు పన్ను అయితే
   ఎ) కార్పోరేట్ పన్ను అనునది వ్యవసాయ ఆదాయములకు వర్తించదు.
   బి) వ్యక్తులకు కంపెనీలు చెల్లించే డివిడెండ్లపై పన్ను విధించబడి, కంపెనీ చెల్లించే పన్నును కంపెనీ ఆదాయం నుండి మినహాయించరాదు.
   సి) కంపెనీ నుండి డివిడెండ్లను పొందే వ్యక్తుల యొక్క, వ్యక్తిగత ఆదాయాన్ని మదింపుచేయుటలో వారి డివిడెండ్ల నుండి కంపెనీ చెల్లించిన పన్నును పరిగణనలోనికి తీసుకొనుటకు ఎటువంటి శాసనము ఉండరాదు.

7) సంబంధిత ప్రావిన్సు, సంబంధిత సంస్థానం, సంబంధిత రాష్ట్రం అనేవి ఒక నిర్దిష్టమైన అంశానికి సంబంధించి రాష్ట్రపతి సందర్భానుసారంగా వర్తింపచేస్తారు.

8) 'బాకీ' (debt) అంటే వార్షిక ఋణపత్రాల క్రిందగాని ఈ హామీ పత్రాల క్రిందగాని తిరిగి చెల్లించవలసిన మొత్తం బాకీ. సంబంధిత ఖర్చులు (debt charges) అనేవి కూడా అదే విధంగా అన్వయించుకోవాలి.

9) ఎస్టేట్ సుంకము (Estate duty) అనగా ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ఇతరులకు సంక్రమించే అతని యావదాస్థుల విలువపై చట్ట ప్రకారము చెల్లించవలసిన సుంకము.

10) అమలులోనున్న శాసనం (existing law) అనగా రాజ్యాంగం అమలులోకి రాకముందు చేయబడిన ఆర్డినెన్సు, శాసనము, బైలా, రూలు లేక రెగ్యులేషన్ అని అర్థం.

11) 'ఫెడరల్ కోర్టు' అనగా భారత ప్రభుత్వ చట్టము 1935 క్రింద ఏర్పాటు చేయబడిన ఫెడరల్ న్యాయస్థానము.

12) వస్తువులు (Goods) : అన్ని రకముల మెటీరియల్స్, కమోడిటీస్, ఆర్టికల్స్ కూడా వస్తువులే.
   ఎ) వస్తువులు మరియు సేవలపై పన్ను : అనగా మానవ సేవనానికి వినియోగించబడు ఆల్కాహోలిక్ లిక్కర్ సరఫరాపై విధించబడు పన్ను మినహాయించి ఇతర వస్తువులు, సేవలు లేక రెండింటిపై విధించబడు పన్ను అని అర్థము.

13) హామీ (Gurantee) : ప్రభుత్వానికి చెందిన సంస్థకు ఏమైనా లాభయేలే వస్తే చేయవలసిన చెల్లింపుల గురించి రాజ్యాంగం అమలులోకి రాకముందు చేసుకోబడిన ఒప్పందం కూడా హామీగా పరిగణించబడుతుంది.

14) హైకోర్టు : ఒక రాష్ట్రమునకు చెందిన హైకోర్టు. ఈ క్రింది న్యాయస్థానములు కూడా హైకోర్టుగానే పరిగణించబడుతాయి.
   ఎ) భారతదేశములోని ఏ ప్రాంతములోనైనా ఈ రాజ్యాంగముచే హైకోర్టుగా వ్యవస్థీకరించబడిన లేక పునర్వ్యవస్థీకరించబడిన న్యాయస్థానము (మరియు)
   బి) రాజ్యాంగములోని మొత్తం లేక కొన్ని అంశములకు సంబంధించి హైకోర్టుగా పార్లమెంటుచే ప్రకటించబడిన న్యాయస్థానము.

15) సంస్థానము: ఒక సంస్థానముగా భారతదేశములోని బ్రిటీష్ వలన ప్రభుత్వముచేత గుర్తించబడినది.

16) విభాగము: అనగా ఈ రాజ్యాంగములోని విభాగము.

17) పెన్షన్: ఒక వ్యక్తికి చెల్లించబడే పెన్షన్. అది కాంట్రిబ్యూటరీ కావచ్చు లేక కాకపోవచ్చు. పదవీ విరమణ తర్వాత చెల్లించే వేతనము, గ్రాట్యుటీ, రిటర్న్ (return) ద్వారా చేయబడే చెల్లింపులు (వడ్డీతో సహా గాని, లేక వడ్డీ లేకుండా గాని), ప్రావిడెంట్ ఫండ్ క్రింద చెల్లించబడేవి కూడా పెన్షన్‌గానే పరిగణించబడతాయి.

18) అత్యవసర పరిస్థితి విధింపు ప్రకటన : 352వ ఆర్టికల్‌లోని క్లాజు (1) క్రింద రాష్ట్రపతి జారీ చేయు ఉత్తర్వు లేక ప్రకటన.

19) పబ్లిక్ నోటిఫికేషన్ అనగా భారత ప్రభుత్వ లేక ఏదైనా రాష్ట్ర ప్రభుత్వ రాజపత్రంలో ప్రకటించబడు ప్రకటన.

20) ఈ క్రింద ఉదహరించబడినవి రైల్వేలుగా పరిగణింపబడవు.
   ఎ) మున్సిపాలిటీ పరిధిలోగల ట్రామ్ వ్యవస్థ (tarm way) (లేక)
   బి) కేవలం ఒక రాష్ట్రమునకే పరిమితమైన ఇతర విధములైన కమ్యూనికేషన్ వ్యవస్థ. అటువంటి వ్యవస్థ రైల్వే వ్యవస్థగా పరిగణింపబడదని పార్లమెంటు శాసనము చేయవలెను.

21) 7వ రాజ్యాంగ సవరణ ద్వారా 1956లో తొలగించబడినది.

22) పాలకుడు: 1971లో చేయబడిన 26వ రాజ్యాంగ సవరణకు ముందు భారత సంస్థానముల పాలకుడుగా రాష్ట్రపతి చేత గుర్తించబడిన వ్యక్తి (ఆ వ్యక్తి రాజు కావచ్చు. అధిపతి కావచ్చు లేక మరెవరయినా కావచ్చు. వారి వారసులుగా ఆ రాజ్యాంగ సవరణను ముందుగా రాష్ట్రపతి చేత గుర్తించబడిన వారికి కూడా పాలకుడు అనే పదం వర్తిస్తుంది).

23) 'షెడ్యూలు' అనగా ఈ రాజ్యాంగమునకు జోడించబడిన షెడ్యూలు.

24) షెడ్యూల్డు కులములు: ఈ రాజ్యాంగంలోని 341వ అధికరణము క్రింద షెడ్యూల్డు కులాలుగా గుర్తించబడిన కమ్యూనిటీలు, కమ్యూనిటీలలోని విభాగము లేక గ్రూపులు.

25) షెడ్యూల్డు తెగలు: ఈ రాజ్యాంగంలోని 342వ ఆర్టికల్ క్రింద షెడ్యూల్డు తెగలుగా గుర్తించబడిన తెగలు, ట్రైబల్ కమ్యూనిటీలు లేక ఆయా తెగలు, కమ్యూనిటీలలోని విభాగం లేక గ్రూపులు.

26) సెక్యూరిటీస్: నిల్వలు కూడా సెక్యూరిటీలుగానే పరిగణింపబడతాయి.
   ఎ) సేవలు : వస్తువులు కానివన్నీ సవలే.
   బి) రాష్ట్రం : అనగా 246-ఎ, 268, 269, 269-ఎ, 279-ఎ అధికరణాలకు సంబంధించి శాససనసభ కలిగి ఉన్న కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా అని అర్థము.
   సి) "సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు" అంటే ఆర్టికల్ 342ఎ

   వెనుకబడిన తరగతులలో రాజ్యాంగ లక్ష్యాల కోసం ఉద్దేశించిన కులాలు, వర్గాలు.

27) సబ్ క్లాజు అనగా సందర్భానుసారం ఒక క్లాజు క్రింద ఇవ్వబడిన సబ్‌క్లాజు.

28) పన్ను విధింపు : ఒక విధమైన పన్ను లేక ఇంపోస్టు అయినా పన్ను విధింపుగానే పరిగణింపబడుతుంది. అది సాధారణమైనది కావచ్చు. స్థానికమైనది కావచ్చు. లేక ప్రత్యేకమైనది కావచ్చు. 'పన్ను' (tax) అనే పదాన్ని కూడా ఇదే విధంగా అర్థం చేసుకోవాలి.

29) ఆదాయంపై పన్ను అదనపు లాభాలపై విధించే పన్ను కూడా ఆదాయంపై పన్నుగాను పరిగణించబడుతుంది.
   ఎ) ఈ క్రింది ఉదహరింపబడినవన్నీ వస్తువుల కొనుగోలు లేక విక్రయంపై పన్ను పరిధిలోనికి వస్తాయి. జరుగు బదలాయింపులు మినహాయించి), డిఫర్ట్‌పేమెంట్ లేదా ఇతర విలువగల ప్రతిఫలంతో కూడిన బదలాయింపులకూ ఈ క్లాజు వర్తిస్తుంది.
   బి) వర్క్, కాంట్రాక్ట్ ద్వారా వస్తురూపంలో గల ఆస్థి బదలాయింపు (వస్తు రూపంలోగాని లేక మరేదైనా రూపంలోగాని).
   సి) వాయిదా పద్ధతి లేక అద్దె - కొనుగోలు పద్ధతిపై వస్తువుల విక్రయం.
   డి) ఏదైనా ఒక అవసరం కోసం కొన్ని వస్తువులను ఉపయోగించుకనే హక్కు బదలాయించటం (ఆ బదలాయింపు నిర్దిష్టకాలం పాటు కావచ్చు. లేక ఆ నిర్దిష్టకాలం కావచ్చు). అయితే, అలా బదలాయించినందుకుగాను కొంత రొఖ్ఖం చెల్లించబడి ఉండాలి. పేమెంట్ డిఫర్ అయినా మరొక విధంగా విలువ కలిగిన ప్రతిఫలం చెల్లించబడినా ఈ క్లాజు వర్తిస్తుంది.

   ఈ విధమైన బదలాయింపు ఆ వస్తువు విక్రయంగానే పరిగణింపబడుతుంది. వస్తువులను బదలాయించిన వ్యక్తి అమ్మిన వ్యక్తి అవుతాడు. వస్తువులు బదలాయించబడిన వ్యక్తి వస్తువులను కొనుగోలు చేసిన వ్యక్తి అవుతాడు.

   (చట్టాలలో గల లొసుగుల ఆధారంగా అనేక రకాల వ్యాపార లావాదేవీలు పన్నుల భారం నుండి తప్పించుకుంటున్నాయి. న్యాయస్థానాల తీర్పులు కూడా పన్నుల ఎగవేతకు అనుకూలంగా వస్తూండటంతో, ఆ న్యాయస్థానాల తీర్పుల ప్రభావాన్ని నిర్వీర్యం చేసేందుకు, ఆ విధంగా అక్రమ పన్నుల ఎగవేతను నిరోధించేందుకై 1982లో 46వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజు చేర్చబడింది.)

30) కేంద్రపాలిత ప్రాంతం - కేంద్ర పాలిత ప్రాంతాలుగా మొదటి షెడ్యూలులో ఉదహరింపబడిన ప్రాంతములు. అదే విధంగా భారతదేశ పరిధిలో ఉండి, మొదటి షెడ్యూలులో ఉదహరింపబడిన ప్రాంతములు కూడా కేంద్రపాలిత ప్రాంతములుగానే పరిగణింపబడతాయి. (2017లో జరిగిన 101వ రాజ్యాంగ సవరణ ద్వారా 12-ఎ, 26-ఎ, 26-బి క్లాజులు అదనముగా చేర్చబడినవి.

**ఆర్టికల్ 367**

1) ప్రత్యేకమైన సందర్భములలో తప్ప, సాధారణ పరిస్థితులలో రాజ్యాంగాన్ని అన్వయించుటలో జనవరల్ క్లాజెస్ చట్టము వర్తిస్తుంది.

2) పార్లమెంటు లేక రాష్ట్ర శాసనసభలచే చేయబడే శాసనాలకు సంబంధించి ఈ రాజ్యాంగములోని ప్రస్తావన సందర్భానుసారంగా రాష్ట్రపతి జారీ చేయు ఆర్డినెన్సులకు, గవర్నర్లు చేయు ఆర్డినెన్సులకు కూడా వర్తిస్తుంది.

3) ఈ రాజ్యాంగమునకు సంబంధించి భారతదేశము తప్ప మిగిలినవన్నీ విదేశములే. అయితే, ఏ దేశాన్ని అయినా విదేశంగా పరిగణించకుండా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

## మెరుగైన రహదారుల నిర్మాణమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం:జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

మధిర, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి:తెలంణ ప్రభుత్వంలో రవాణా సౌకర్యం కోసం మెరుగైన రహదారులను నిర్మించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యమని దానిలో భాగంగానే దెందుకూరు నుండి మాటూరు పేట వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది కోట్ల రూపాయలతో నిర్మించిన బిటి రోడ్డు నిర్మించడం జరిగిందని జడ్పీ చైర్మన్ కమల్ రాజు పేర్కొన్నారు. ఈ రహదారి ఎంతో మంది రైతులకు వారి వ్యవసాయ సాగుకు ఉపయోగపడుతుందని తెలిపారు. డొంక రోడ్ లను బిటి రోడ్లు గా మార్చి రవాణా వ్యవస్థను మెరుగుపరచడమే టిఆర్ఎస్ లక్ష్యమన్నారు. శుక్రవారం ఈ బిటి రోడ్డు పనులను టిఆర్ఎస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వర రావు ఆత్మ కమిటీ చైర్మన్ రంగి శెట్టి కోటేశ్వరరావు, మధిర సొసైటీ చైర్మన్ బక్కి ప్రసాద్ దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకట కృష్ణ, టిఆర్ఎస్ నాయకులు వార్డు కౌన్సిలర్ మల్లాది వాసు, వై వి అప్పారావు,ప్యారి పాల్గొన్నారు.





## తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలకు ఎంపికైనమాటూరుహైస్కూల్ విద్యార్థులు

మధిర, జూన్ 25, ప్రజాపాలన ప్రతినిధి: మధిర మండలంలోని మాటూర్ హైస్కూల్ కి చెందిన షేక్ రెహ్మేతున్నిసా, షేక్ బాజీ, షేక్ జాన్ పాషాలి లు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఐనటువంటి వైరా, ఖమ్మం, దమ్మపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కు సీటు సంపాదించారని పాఠశాల హెచ్ఎం శ్రీ దీవి సాయి కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో మధిర మండల విద్యాశాఖాధికారి శ్రీ వై ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నటువంటి ఉచిత జూనియర్ కళాశాలలో చక్కని సదుపాయాలతో కూడిన విద్య లభిస్తుందని, దీనిని నిరుపేద ప్రతిభ కల విద్యార్థులు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కళాశాలలకు ఎంపికైన మాటూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ శ్రీ మేడిశెట్టి రామకృష్ణారావు, ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, కంచిపోగు ఆదాము,రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, వేము రాములు, మహమ్మద్ చాంద్ బేగం, గుంటుపల్లి రమాదేవి వేములపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సినిమా షో

## శంకర్, కైరా అద్వానీ.. పెద్ద డీల్



బాలీవుడ్ హీరోయిన్ కైరా అద్వానీ స్టార్ డైరెక్టర్ శంకర్ తో పెద్ద డీల్ చేసుకున్నట్టు తెలుస్తోంది. శంకర్ డైరెక్ట్ చేయనున్న తదుపరి చిత్రాల్లో కైరా అద్వానీనే కథానాయకిగా చేయాలనేది ఈ డీల్ సారాంశమాట. శంకర్ తన తర్వాతి రెండు సినిమాలను ప్రకటించేశారు. వాటిలో ఒకటి రామ్ చరణ్ హీరోగా దిల్ రాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం. అలాగే 'అపరిచితుడు' హిందీ రీమేక్. ఇందులో రణ్వీర్ సింగ్ హీరోగా నటించనున్నాడు. ఈ రెండు సినిమాల్లో కూడ కైరా అద్వానీ కథానాయికగా చేయనుందట. రామ్ చరణ్ సినిమా విషయమై త్వరలోనే కైరా అద్వానీ నుండి అఫీషియల్ కన్ఫర్మేషన్ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాను శంకర్ 'ఇండియన్-2' కంప్లీట్ చేశాక మొదలుపెట్టనున్నారు. భారీ వ్యయంతో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ రెండు సినిమాలు మాత్రమే కాదు శంకర్ భవిష్యత్తులో డైరెక్ట్ చేయబోయే ఇంకొన్ని సినిమాల్లో కూడ కైరా అద్వానీనే కథానాయికగా చేయనుందనేది బాలీవుడ్ వర్గాల టాక్. అదే గనుక నిజమైతే కైరా అద్వానీ కెరీర్ మరింత వెలిగిపోవడం ఖాయం. కొన్నేళ్లపాటు ఆమెకు పెద్ద సినిమాల గురించి ఎదురుచూడాల్సిన అవసరం కూడ ఉండదు.

## బక్కచిక్కిన బ్యూటీతో 'అఖండ' ఐటమ్ సాంగ్..?



నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ "అఖండ". 'సింహా' 'లెజెండ్' వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత వీరి కలయికలో వస్తున్న ఈ హ్యాట్రిక్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వాటికి ఏమాత్రం తగ్గకుండా బోయపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్న 'అఖండ' చిత్రంలో నందమూరి అభిమానులు ఏమేమి ఆశిస్తారో అన్ని అంశాలు ఉండేలా చూసుకుంటున్నారు. ఇందులో యాక్షన్ ఎపిసోడ్స్ - బాలయ్య శైలి డైలాగ్స్ కు కొదవలేదని ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ తో అర్థం అయింది. అలానే ఫ్యాన్స్ ను మరింత ఉత్సాహపరచడానికి ఓ ఐటమ్ సాంగ్ ను ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మాస్ ఆడియన్స్ ను ఉర్రూతలూగించేలా బోయపాటి 'అఖండ' లో ఈ స్పెషల్ సాంగ్ ని ప్లాన్ చేస్తున్నారట. దీని కోసం టాలీవుడ్ రత్తాలు రాయ్ లక్ష్మీ ని తీసుకోనున్నారని టాక్. లక్ష్మీ రాయ్ గతంలో బాలకృష్ణ సరసన 'అధినాయకుడు' చిత్రంలో హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బక్కచిక్కిపోయి మరింత గ్లామరస్ గా కనిపిస్తున్న రాయ్ లక్ష్మీ మరోసారి బాలయ్యతో ఆడిపాడనుందని అంటున్నారు. టాలీవుడ్ లో స్పెషల్ సాంగ్స్ తో క్రేజ్ తెచ్చుకున్న ఈ ఐటమ్ భామకు బాలయ్య రికమెండేషన్ కూడా ఉందని టాక్. మరి 'అఖండ'లో రాయ్ లక్ష్మీ కోసం థమన్ దగ్గర నుంచి బోయపాటి ఎలాంటి మాస్ నెంబర్ ని పిండుకుంటాడో చూడాలి. కాగా మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ - పూర్ణ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

## సీనియర్ నటుడికి సమంత స్పెషల్ బర్త్ డే విషెస్..!



ప్రస్తుతం సౌత్ టు నార్త్ వరకు సినీ ఇండస్ట్రీలో వైరల్ అవుతున్న హీరోయిన్ పేరు ఏదంటే అక్కినేని సమంత అనే చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అయినటువంటి సమంత.. సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టీవ్. అందుకే ఎప్పటికప్పుడు ఇండస్ట్రీలోనే కాకుండా బయట జరిగే ఇన్సిడెంట్స్ పై కూడా స్పందిస్తుంది. ముఖ్యంగా స్పెషల్ విషెస్ తెలియజేయడంలో అక్కినేని కోడలు ముందే ఉంటుంది. అయితే టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ సీనియర్ యాక్టర్ మురళీ మోహన్ గారిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. మరి సోషల్ మీడియాలో చెబితేనే హల్చల్ చేసేస్తుంటారు. కానీ అక్కినేని కోడలు నేరుగా వెళ్లి మురళీ మోహన్ ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి మరీ శుభాకాంక్షలు తెలపడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే అసలు విషయం ఏంటంటే.. సమంత నాగచైతన్య దంపతులు ప్రస్తుతం గచ్చిబౌలిలోని జయభేరి ఆరంజ్ కౌంటీలో నివాసం ఉంటున్నారు. అయితే వీరి ఇంటి పక్కనే మురళీ మోహన్ గారు నివాసం ఉంటున్నారు. సో ఆ విధంగా సమంత పక్కింట్లోనే ఉంటుంది కాబట్టి స్వయంగా వెళ్లి విషెస్ తెలిపిందని కథనాలు చెబుతున్నాయి. కానీ మురళీ మోహన్ ఆనాడు అక్కినేని నాగేశ్వరరావు గారితో ఉన్నటువంటి అనుబంధం కారణంగా కూడా ఆమె విషెస్ తెలిపిందని మరికొన్ని కథనాలు చెబుతున్నాయి. ఏదేమైనా మురళీ మోహన్ గారు నేటితో 81 సంవత్సరాలను క్రాస్ చేశారు. కొన్నేళ్లుగా సినీ ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న ఆయన నటుడుగానే కాకుండా రాజకీయాల్లో కూడా రాణించారు. అలాగే సినీ ఇండస్ట్రీకి సంబంధించి మా అసోసియేషన్ ద్వారా కూడా ఎన్నో సేవలు అందించారు. ప్రస్తుతం ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం అక్కినేని కోడలు సమంత పాన్ ఇండియా మూవీ శాకుంతలంతో పాటు కాతువకుల రెండు కాదల్ అనే తమిళ సినిమాలో నటిస్తోంది. ఇటీవలే ఫ్యామిలీ మ్యాన్ అనే వెబ్ సిరీస్ తో సంచలనం సృష్టించింది.

## "రాధే శ్యామ్" షురూ చేసేసిన ప్రభాస్.!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం "రాధే శ్యామ్". అద్భుతమైన ప్రేమ కావ్యంగా ఈ చిత్రాన్ని దర్శకుడు రాధా కృష్ణ తెరకెక్కించారు. అయితే ఈ సినిమా ఆల్రెడీ షూట్ అంతా కంప్లీట్ అయ్యిపోయినా మళ్ళీ కొంత పార్ట్ రీ షూట్ చెయ్యాలని భావించి మేకర్స్ కొన్ని రోజులు ప్లాన్ చేశారు. కానీ అనూహ్యంగా కరోనా రెండో వేవ్ మూలాన ఆ షూట్ వాయిదా పడింది. మరి ఇప్పుడు మళ్ళీ కరోనా తగ్గుతున్న నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం షూట్ కి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. ఈ జూన్ చివరి వారం నుంచి స్టార్ట్ చెయ్యనున్నారని టాక్ రాగా ఇప్పుడు అది నిజం అయ్యింది. ఈరోజు నుంచే ప్రభాస్ రాధే శ్యామ్ బ్యాలన్స్ షూట్ ను షురూ చేసేసినట్టు తెలుస్తుంది. ఇంకొన్ని రోజుల్లో ఈ షూట్ కంప్లీట్ అయ్యిపోనుంది. దీని తర్వాత మళ్ళీ "సలార్" షూట్ లో పాల్గొననున్నాడు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989